Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 31.10.2014, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 22 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com



## ప్రపంచ క్రికెట్ వీరుడు

# జిల్లాకు వరాల దేవుడు


- 15న పోర్టులో బసచేస్తున్న సచిన్
- 16న పి.ఆర్.కండ్రిక సందర్శన

అతను బ్యాట్ ఝులిపిస్తే బంతి ఆకాశంలోని చుక్కలను ముద్దాడుతుంది. అతను బ్యాట్ పట్టుకుని మైదానంలోకి వచ్చాడంటే బంతి విసిరే బౌలర్ల చేతులు వణుకుతుంటాయి. అతని ఆటకు ప్రపంచమే దాసోహమంది. క్రికెట్ క్రీడలో అతను సృష్టించిన రికార్డులే పెద్దరికార్డు.

(మిగతా 10వ పేజీలో)

## ఊపుమీదున్న బీజేపీ

# తదుపరి టార్గెట్ ఏపి




- రాష్ట్రంలో మొదలైన వలసలు
- ఉత్సాహంగా కమలనాథులు

కాలం మనుషుల వ్యక్తిగత జీవితాలలోనే కాదు, రాజకీయపార్టీల ప్రస్థానంలో కూడా కీలకపాత్ర పోషిస్తుంది. ఏ పార్టీకి ఏ టైంలో కాలం కలిసొస్తుందో చెప్పలేం. కాలం కలసిరాకుంటే వటవృక్షం లాంటిదనుకున్న పార్టీ కూడా గడ్డి పరకలా మారుతుంది. టైం కలిసొస్తే పిచ్చిమొక్కలాంటి పార్టీ కూడా వటవృక్షమవుతుంది.

ముఖ్యంగా భారత రాజకీయాలలో (మిగతా 10వ పేజీలో)

## పొద్దుయే కాదు.. సభలో నిద్రరోగా!



అక్టోబర్ 27వ తేదీ నెల్లూరు ఇందిరాభవన్‌లో జరిగిన జిల్లా మరియు నగర కాంగ్రెస్ అధ్యక్షుల సమావేశంలో తమను తాము మరిచి నిద్రపోతున్న కాంగ్రెస్ నాయకులు

ప్రథమ వర్ధంతి





కీ॥శే॥ శ్రీమతి వేమిరెడ్డి శ్యామలమ్మ

నిర్యాణం: 01-11-2013

"అనురాగానికి పర్యాయపదం - ఆప్యాయతకు దర్పణం - అమ్మతనానికి పరిపూర్ణత్వం.."!

ఎలా మరువగలం అమ్మా.. మీ మూర్తి మత్వం..!!

మిమ్మల్ని స్మరించుకుంటూ...

కుమారుడు - కోడలు
వేమిరెడ్డి కోటారెడ్డి - రమాదేవి

కుమారుడు:
వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి
గ్లోబల్ కాంట్రాక్టర్, నెల్లూరు.

కుమార్తె - అల్లుడు
సి.శశికళ - సి.అశోక్‌రెడ్డి

# నీళ్ళిచ్చి రైతుల్ని ఆదుకుంటాం

సింహపురి సమాచారం

### - రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి దేవినేని



నెల్లూరుజిల్లాలో సెంటు భూమి కూడా ఎండిపోకుండా సాగునీరిచ్చి రైతుల్ని ఆదుకుంటామని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు పేర్కొన్నారు. అక్టోబర్ 25వ తేదీ రాపూరు మండలంలోని కండలేరు అతిథి గృహంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నిబంధనల పేరుతో తాగు, సాగునీరు ఇవ్వకుండా రైతుల్ని ఇబ్బంది పెడితే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు సోమశిల నుంచి పెన్నా డెల్టాకు నీరు విడుదల చేస్తున్నామన్నారు. జలయజ్ఞం పేరుతో గత ప్రభుత్వం నిధుల్ని దుర్వినియోగం చేసిందని, రాష్ట్రంలోని అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు జిల్లాలోని కండలేరు, సోమశిల, పెన్నా ప్రాజెక్టు పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్టీఆర్ చొరవతో చెన్నైకి తాగునీరు, నెల్లూరు, చిత్తూరుజిల్లాల రైతులకు తాగు, సాగు నీరివ్వడం ఆనందించదగ్గ విషయమన్నారు.

ఈ సమావేశంలో మాజీమంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పరసా రత్నం, ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, బొల్లినేని వెంకటరామారావు, తెదేపా జిల్లా అధ్యక్షుడు బీదా రవిచంద్ర, జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, జేసీ రేఖారాణి, ఆర్డీఓ సుబ్రహ్మణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాలినడకన తిరుమలకు పోలంరెడ్డి



కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కలియుగదైవం వెంకటేశ్వరస్వామికి మెగా సీనియర్ భక్తుడు. ఆయనకు మొక్కుకున్నాడంటే పాటించి తీరుతాడు. మొన్న ఎన్నికల్లో గెలిచాక తన ప్రజలు తన నియోజకవర్గం బాగుండాలని కోరుకుంటూ ఆయన తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. వారం క్రితమే ఆయన కోవూరు నుండి మొదలుపెట్టి ఐదురోజుల పాటు నడిచి తిరుమలకు చేరుకుని మొక్కు చెల్లించుకున్నారు. పోలంరెడ్డి గతంలోనూ కోవూరు నుండి కాలినడకన తిరుమలకు వెళ్లి ఉండడం విశేషం.

### వర్షంతో ముగిసిన

# రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు


రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ క్రికెట్ పోటీలు సోమవారం ముగిసాయి. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 13జిల్లాల నుంచి వచ్చిన అండర్ -14 క్రీడాకారులకు నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలోను, అండర్-17క్రీడాకారులకు నెల్లూరు రూరల్ మండలం కనుపర్తిపాడులోని జడ్పీ హైస్కూలు మైదానంలో పోటీలు నిర్వహించారు. అయితే వర్షం కారణంగా అండర్-14 పోటీలను కూడా కనుపర్తిపాడు జడ్పీహైస్కూలు, ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ప్రియదర్శిని కళాశాల ప్రిన్సిపల్ రమేష్‌కుమార్ పోటీలను ప్రారంభించారు. వర్షం రావడంతో పోటీలు నిలిచిపోయాయి. దీంతో లీగ్‌లో గెలుపొంది నాకౌట్‌కు చేరిన వివిధ జిల్లాల జట్లకు టాస్ వేసి విజేతలను ప్రకటించారు. అండర్-14లో విశాఖపట్నం జట్టు, అండర్-17లో కడప జట్టును అదృష్టం వరించింది. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎన్.విక్టర్, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి సంపత్, పిఇటీలు రమేష్, వేణు, సుకుమార్ అంపైర్లుగా వ్యవహరించారు. గెలుపొందిన జట్లకు జిల్లా విద్యాశాఖాధికారిణి ఉష బహుమతి ప్రదానం చేశారు. ఉత్తమ ప్రతిభ కనపరచిన క్రీడాకారులకు మెడల్స్ అందజేశారు.

# సోమశిలకు జలకళ



నెల్లూరుజిల్లా రైతాంగానికి వరప్రసాదిని సోమశిల రిజర్వాయర్. ఇదే లేకపోయివుంటే నెల్లూరుజిల్లా మరో పాలమూరును తలపించేది. ఈ రిజర్వాయర్ నిండితేనే జిల్లా రైతన్నల ముఖాలలో ఆనందం కనిపిస్తుంది.

పెన్నానది మీద ఈ డ్యాంను కట్టినప్పటికి గత కొన్నేళ్లుగా కృష్ణా జలాలతోనే దీనిని నింపుకుంటుండడం విశేషం. గత అయిదారేళ్లుగా పెన్నకు పెద్దగా వరదలొచ్చింది లేదు. కర్నాటకతో పాటు ఎగువ జిల్లాలైన అనంతపురం, కడప జిల్లాల్లో భారీగా వర్షాలు కురిస్తేనే పెన్నకు వరదొస్తుంది. సోమశిల నిండుతుంది. గత కొన్నేళ్లుగా అక్కడ వర్షాలు లేక శ్రీశైలం నుండీ సోమశిలకు నీటిని విడుదల చేస్తూ వచ్చారు. ఈ ఏడాది కూడా శ్రీశైలం నుండే నీటిని విడుదల చేసారు. సోమశిలలో ఓ మోస్తరు నీటిమట్టం ఉండగా, తాజాగా కర్నూలు, కడప జిల్లాల్లో కురిసిన వర్షాలతో కుందూ నది ప్రవహించడంతో పెన్నకు ప్రవాహమొచ్చింది. దీంతో సోమశిలకు జలకళ వచ్చింది.



# శ్రద్ధాంజలి



నిండునూరేళ్ళ పరిపూర్ణ జీవితాన్ని సాగించి
అక్టోబర్ 30 గురువారం నాడు తనువు చాలించిన
ఆత్మీయమూర్తి, ప్రేమానురాగాలదీప్తి

## శ్రీమతి గునుపాటి రుక్మిణమ్మ గారి

ఆత్మశాంతికై ప్రార్థిస్తూ... ఆమె పెద్దకుమారుడు
**జి.వి.కె.రెడ్డి గారికి,** వారి సోదరులు, సోదరీమణులు
మరియు ఇతర కుటుంబసభ్యులకు
మనోస్థైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తూ...
ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం.

నెల్లూరు.

## 'ప్రభా'తం

# కదిలిన 'నల్ల'డొంక



తీగను కదిలిస్తే డొంకంతా కదిలిందన్న సామెతగా తయారైంది..నల్లధనం పరిస్థితి. నల్లధనంపై ధ్వజమెత్తడం, నల్లధనాన్ని విదేశాల నుంచి వెనక్కు తెప్పిస్తామని ప్రకటించడం వంటివన్నీ సాధారణంగా జరిగిపోయే ప్రహసనాలే కదా అని, ఇప్పటిదాకా ఎవరికి వారు నిమ్మకు నీరెత్తినట్లుగా వున్న నల్లకుబేరులు.. ఇప్పుడు చకచకా జరుగుతున్న పరిణామాలతో హడలెత్తిపోతున్నారు. నల్లధనం విషయంలో గతంలో వున్న ఉత్తర్వులకు ఎలాంటి సవరింపులూ వుండవని సుప్రీంకోర్టు స్పష్టం చేయడం, విదేశీ బ్యాంకు ఖాతాదారులకు మీరు రక్షణగా నిలవాల్సిన అవసరం లేదని కేంద్రాన్ని మందలించడం, నల్లకుబేరుల జాబితాను తమకు సమర్పించాల్సిందేనంటూ కేంద్రప్రభుత్వానికి సుప్రీం కోర్టు హుకుం జారీ చేయడం చకచకా జరిగిపోయాయి. అంతేకాదు, విదేశీ బ్యాంకుల్లో ఖాతాలున్న అందరి పేర్లనూ బుధవారం ఉదయం 10.30 గంటలకల్లా తమకు సమర్పించాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించడంతో, ఆ మేరకు బుధవారం ఆ జాబితాను సమర్పించింది. సుప్రీం కోర్టు ఆదేశానుసారం మొత్తం 627 పేర్లతో కూడిన జాబితాను షీల్డ్ కవర్‌లో పెట్టి, కేంద్రప్రభుత్వం సుప్రీం కోర్టుకు అందించింది. ఆ షీల్డ్ కవర్‌లోని జాబితాలను సిట్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షులే తెరవాలని సుప్రీం కోర్టు సూచించింది. ఈ విషయాలపై సిట్ దర్యాప్తు చేస్తుందని కూడా స్పష్టం చేసింది. ఈ పరిణామాలతో, ఇక నల్లధనం బండారం బయట పడేందుకు మార్గం సుగమమైనట్లే. ఎంతో కాలం నుంచి ఎటూ తేలకుండా వున్న ఈ నల్లధనం వ్యవహారంలో సుప్రీంకోర్టు తీసుకున్న చొరవ ఎంతో ప్రశంసాత్మకమైనది, అందుకు సర్వత్రా ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.


వాస్తవానికి, ఈ నల్లధనం తీగ ఇప్పుడు కాదు.. ఎప్పుడో కదిలింది. అయితే, గతంలో కదిలినప్పుడు అంత చలనం రాలేదు కానీ, ఇప్పుడు రాబోయే పరిస్థితి తలచుకుంటేనే అక్రమార్కుల వంట్లో వణుకు పుడుతోంది. నల్లధనం గుట్టు విప్పాల్సిందే నంటూ సుప్రీంకోర్టు ఖరాఖండిగా ఆదేశించడంతో, అక్రమంగా నల్లధనాన్ని కూడగట్టి విదేశాల్లో దాచుకున్న నల్ల కుబేరులు ఖంగుతింటున్నారు. అందుకు తగ్గట్టుగా మోడీ సర్కార్ కూడా నల్లకుబేరుల ఆట కట్టించడానికి సంసిద్ధమైవుండడంతో, ఈ పరిస్థితులు ఎటు తిరిగి ఎటొస్తాయోననే ఆందోళనతో అక్రమార్కులు బెంబేలెత్తిపోతున్నారు. లక్షలు, కోట్లాది రూపాయలను అక్రమంగా కూడబెట్టి, పన్ను ఎగవేసేందుకు వీలుగా ప్రభుత్వానికి ఎలాంటి లెక్కాపక్కా చూపకుండా, కూడగట్టిన ఆ నల్లధనాన్నంతా ఎవరికంటా పడకుండా విదేశాలకు ఎగదోలుకుపోయిన అక్రమార్కుల గుండెల్లో ఇప్పుడు రైళ్ళు కాదు..నిజంగానే విమానాలు పరుగెడుతున్నాయి. అలా సైగ్గా..అక్రమంగా తరలిపోయిన లక్షలాది కోట్ల రూపాయల నల్లధనం అనుపానులు తేల్చేందుకు సుప్రీంకోర్టు సిద్ధం కావడం, అందుకు తగు ఆదేశాలు జారీ చేయడం దేశవ్యాప్తంగా సంచలనం కలిగిస్తోంది. దీంతో, నల్లధనం విషయంలో ఏ మేరకు అక్రమాలు జరిగాయో కూడా నిర్ధారణ కానుందని భావిస్తున్నారు. ఎవరెవరు ఎంతెంత ధనం అక్రమంగా కూడగట్టారో ఆరా తీసేందుకు, అక్రమాలు జరిగినట్లు నిరూపితమైతే తదుపరి చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధమవుతోండడం పట్ల ప్రజల్లోనూ సంతోషం వ్యక్తమవుతోంది. నల్లధనంపై దాపరిక ధోరణి, దాని వివరాల పట్ల సాచివేత ధోరణి ఎంతోకాలంగా సాగిన వైనం అందరికీ తెలిసిందే. కోటానుకోట్ల నల్లధనం దాచిపెట్టుకోగలిగిన ఘనులంతా బడాబాబులే కావడంతో, ఈ వ్యవహారం అంత తేలిగ్గా ఒక కొలిక్కి వస్తుందా అనే సందేహం సామాన్యులకే కాదు, పెద్దవారిలో సైతం వుండేది.

నల్లధనం వివరాలు రాబట్టడంలో అనేక అడ్డంకులు, ఆక్షేపణలు వున్నాయని, అది నల్లడబ్బా కాదా అన్నది ముందు తేల్చుకోవాలని. అది అక్రమమా కాదా అన్నది తేలాలని...ఇలా రకరకాల కారణాలతో ఇన్నాళ్ళూ..ఇన్నేళ్లూ కాలయాపన జరిగిపోతూ వచ్చింది. మరోవైపు, నల్లధనం మాట వినవచ్చినప్పుడల్లా..దాని నిగ్గు తేల్చేస్తామని గతంలోనూ నాయకులు ప్రకటనలు గుప్పించడం, ఆ తర్వాత ఇందులో చాలా ఇబ్బందికరమైన అంశాలున్నాయంటూ సన్నాయినొక్కులు నొక్కడం కూడా పరిపాటైపోయింది. వీటన్నిటికీ తెర దించాలని, నల్లధనాన్ని వెలికితీసి, విదేశాలలో వున్న ఆ ధనాన్ని వెనక్కి తెప్పించాలని, అక్రమాలను ఆరా తీసి విచారించాలని బిజెపి ఎంతోకాలం నుంచి డిమాండ్ చేస్తోంది. కోట్లాది రూపాయల భారతీయుల నల్లధనం విదేశీ బ్యాంకుల్లో వుందని, ఆ ధనాన్ని వెనక్కి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా హామీ ఇచ్చింది. ఆ మేరకు కాంగ్రెస్ కొంత ప్రయత్నమైతే చేసింది కానీ, ఆచరణకు వచ్చేసరికి అది అటకెక్కిపోయింది. ఈ నేపథ్యంలో, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే, విదేశాల్లో మూలుగుతున్న నల్లధనాన్ని వెనక్కి తీసుకువస్తామని బిజెపి ప్రధాని అభ్యర్థిగా వున్న మోడీ ఎన్నికల ప్రచారంలో స్పష్టంగా ప్రకటించడం అప్పట్లో సంచలనాత్మకమైంది. ఆ తర్వాత ప్రధానిగా మోడీ పదవిని అధిష్టించడం, అనుకున్నట్లుగానే నల్లధనం వ్యవహారం అమీతుమీ తేల్చేందుకు సిద్ధం కావడం, నల్లధనాన్ని వెనక్కి తెప్పించేందుకు 'సిట్' అనే దర్యాప్తు సంస్థను ఏర్పాటు చేయడం అందరికీ తెలిసిందే. ఆ తర్వాత నల్లకుబేరుల వివరాలు తెలుసుకునేందుకు స్విస్ బ్యాంక్‌లతో సంప్రదింపులు కూడా జరిగాయి. నల్లధనం సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా వుందని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ కూడా తన బడ్జెట్ ప్రసంగంలో హామీ ఇచ్చారు. నల్ల కుబేరుల జాబితాను దాచిపెట్టేది లేదని ఆయన స్పష్టం చేశారు కూడా. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో, నల్లధనం విషయంలో ఎలాంటి సందిగ్ధతలూ అవసరం లేదని, నల్లకుబేరుల జాబితాను తమకు సమర్పించాల్సిందేనని సుప్రీం కోర్టు నిర్ద్వందంగా స్పష్టం చేయడం జరిగింది.

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్రం ఆ జాబితాను సమర్పించడంతో నల్లధనం గుట్టు రట్టు చేసే విషయంలో ప్రాథమికంగా వున్న అడ్డంకులన్నీ తొలగిపోయినట్లే. ఇక దర్యాప్తు జరగాల్సివుంది. నల్లధనం అక్రమాల లోగుట్టులన్నీ బహిర్గతం కావాల్సివుంది. ఏదేమైనా, నల్లధనం వ్యవహారం గుట్టు రట్టు చేసేందుకు సుప్రీం కోర్టు తీసుకున్న చొరవ అభినందనీయం. కేంద్రం కూడా అదేవిధంగా మరింత చొరవ తీసుకుని ముందడుగు వేస్తే ఇక నల్లకుబేరుల ఆటలు కట్టినట్లే!..


నల్లధనం గుట్టు విప్పాల్సిందే నంటూ సుప్రీంకోర్టు ఖరాఖండిగా ఆదేశించడంతో, అక్రమంగా నల్ల ధనాన్ని కూడగట్టి విదేశాల్లో దాచుకున్న నల్ల కుబేరులు ఖంగుతింటున్నారు. అందుకు తగ్గట్టుగా మోడీ సర్కార్ కూడా నల్లకుబేరుల ఆట కట్టించడానికి సంసిద్ధమైవుండడంతో, ఈ పరిస్థితులు ఎటు తిరిగి ఎటొస్తాయోననే ఆందోళనతో అక్రమార్కులు బెంబేలెత్తిపోతున్నారు.

# 'నుడా'పైనే నెల్లూ'రియల్' ఆశలు



రాష్ట్ర విభజన తర్వాత నెల్లూరు జిల్లాలో పరిస్థితులు తారుమారయ్యాయి. వ్యవసాయ, వ్యాపార రంగాలు కుదేలయ్యాయి. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వ్యాపారమైతే దారుణంగా దెబ్బతింది. ప్రతి వ్యాపారానికి రియల్ ఎస్టేట్‌తో లింక్ ఉంటుంది. రియల్ ఎస్టేట్ బాగుంటేనే జోరుగా నిర్మాణాలు జరుగుతుంటేనే ఇతర వ్యాపారాలు కూడా సాగుతుంటాయి. కాని గత మూడేళ్లుగా రియల్ వ్యాపారం ముసుగుతన్ని పడుకుంది. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాకన్నా పరిస్థితిలో మార్పు వస్తుందని భావించిన వారికి నిరాశే మిగిలింది. వ్యాపారం మొదలుకావడం అటుంచి, ఉన్న వ్యాపారాలు కూడా ఊడ్చు పెట్టుకుపోయాయి. రాష్ట్రం ప్రభుత్వం అయితే నెల్లూరుని మరీ చిన్నచూపు చూస్తోంది. కేంద్రం ప్రకటించిన ఒక్క జాతీయ సంస్థను కూడా నెల్లూరుకు కేటాయించలేదు. ఇక ఇప్పుడు మిగిలిన అరకొర ఆశల్లా నెల్లూరును అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీగా మార్చడమే. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం నెల్లూరుతో పాటు రాష్ట్రంలో మరికొన్ని నగరాలలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు కూడా నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేసి దాదాపు 1300కోట్ల రూపాయలు హడ్కో నిధులు మంజూరు చేయడానికి లైన్ క్లియర్ చేసినట్లుగా సమాచారం.

నెల్లూరు నగరపాలక సంస్థ ఇక నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ(నుడా)గా మారనుంది. నుడా పరిధి నెల్లూరు నగరం దాటి విస్తరించనుంది. మొత్తం ఎనిమిది మండలాలతో కూడిన నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థకు కొన్ని నెలల్లోనే నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం వుంది. నుడా వైస్ ఛైర్మెన్‌గా ఐఏయస్ స్థాయి అధికారి అవసరం ఆ మేరకు భవిష్యత్తు అవసరాల దృష్ట్యా నెల్లూరు నగర కమీషనర్‌గా ఐఏయస్‌ను నియమించారు. నెల్లూరుకు భూగర్భ డ్రైనేజీ అనుమతులు తీసుకువచ్చారు. నెల్లూరు రూరల్ పరిధిలో ఔటర్ రింగురోడ్డు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో నెల్లూరుకు మహర్దశ రానుంది. నెల్లూరు మునిసిపాలిటీగా 1885లో ప్రారంభమైంది. 1895లో తొలిఛైర్మెన్‌ను ప్రభుత్వం నియమించింది. 1913లో తొలి కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. అప్పుడు నెల్లూరు 28వార్డులతో నెల్లూరు విస్తరించింది. 2009లో నెల్లూరు నగర పాలక సంస్థగా మారింది. 54 డివిజన్లతో కూడిన నగరంలా అభివృద్ధి చెందింది. 18చదరపు కిలోమీటర్లు విస్తీర్ణంలో ఉన్న నెల్లూరు అభివృద్ధి చెందుతూ 102.06 చదరపు కిలో మీటర్లకు విస్తరించింది. 2013 లో నెల్లూరు రూరల్ పరిధిలోనే 15 గ్రామ పంచాయితీలను విలీనం చేసుకుని 150.58 చదరపు కిలో మీటర్ల నగరంగా మారింది. ఇలా అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థగా మారనుంది. నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థగా మారితే కేంద్రం నుంచి నేరుగా నిధులు విడుదలవుతాయి. ప్రత్యేక ప్రభుత్వంలా 'నుడా' పని చేస్తుంది. ఛైర్మెన్‌గా నామినేటెడ్ పదవి వుంటుంది. వైస్ ఛైర్మెన్‌గా ఐఏయస్‌ను కేటాయిస్తారు. ఇప్పటికే కమీషనర్‌గా ఐఏయస్ ఉన్నారు. కోఆప్షన్ సభ్యులను ఎన్నుకుంటారు. నెల్లూరు జిల్లాలోని ఎనిమిది మండలాలను విలీనం చేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నారు. తూర్పున ముత్తుకూరు, ఇందుకూరుపేట, టీపీగూడూరు మండలాలు, ఉత్తరం వైపున కోవూరు, బుచ్చి దక్షిణాన వెంకటాచలం, మనుబోలు మండలాలు, నెల్లూరు రూరల్ మండలాలను 'నుడా'లో విలీనం చేసే ప్రతిపాదనలు వేగంగా జరుగుతున్నాయి.




## 'స్వచ్ఛభారత్' చాలా మంచి ప్రోగ్రామ్

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేపట్టిన 'స్వచ్ఛభారత్' చాలామంచి కార్యక్రమం. ప్రజలలో చైతన్యం నింపుతుంది. ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాల్సిన ప్రోగ్రామ్ ఇది. మన ఇళ్లను ఎలా శుభ్రంగా ఉంచుకుంటామో, అలాగే మన వీధిని, మన ప్రాంతాన్ని కూడా శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. దేశంలోని అన్ని ప్రాంతాలను ప్రభుత్వాలే శుభ్రంగా ఉంచాలంటే కుదరదు. అందరూ భాగస్వాములైతే అన్ని ప్రాంతాలు శుభ్రంగా ఉంటాయి. అసలైన స్వచ్ఛభారత్ సాక్షాత్కారమౌతుంది.

**– ఎస్.దీప్తి, నెల్లూరు.**

## బజారు మనిషి

కేసీఆర్ ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా కాదు, ఒక బజారు మనిషిలా, తాగుబోతులా ప్రవర్తిస్తున్నాడు. అతని భాష నీచాతినీచంగా ఉంటుంది. తెలంగాణలో ఉన్నోళ్లంతా అతనిలా మాట్లాడరు. సీఎంగా వున్న వ్యక్తి మాట్లాడాల్సిన భాష ఇది కాదు. సాటి సీఎం అని కూడా చూడకుండా చంద్రబాబును గురించి నీచంగా మాట్లాడుతుండడం విచారకరం. తెలంగాణకు చంద్రబాబు కాదు కేసీఆరే చీడపురుగు. అతని వల్లే తెలంగాణ నష్టపోవడం ఖాయం.

**– జి.వి.ఎస్.నాయుడు, హైదరాబాద్.**

## మోడీకి అభినందనలు

దీపావళి పండుగను అత్యంత ఎత్తైన సైనిక ప్రాంతం సియాచిన్‌లో సైనికులతో కలిసి జరుపుకున్నందుకు ప్రధాని నరేంద్రమోడీకి అభినందనలు. మోడీ చర్య మన సైనికులలో ఎనలేని ఉత్సాహాన్ని నింపిందనడంలో సందేహం లేదు. గతంలో ఏ ప్రధాని కూడా సైనికులతో ఇంత దగ్గరగా మసలుకోలేదు. మోడీ స్ఫూర్తివంతమైన పనితీరు అందరిలోనూ ఉత్సాహాన్ని నింపుతుంది.

**నూతక్కి చెంచు సుబ్బారెడ్డి, నెల్లూరు.**



ఆరడుగుల మనిషిని చంపడానికి ఐదు అంగుళాల బుల్లెట్ చాలు. కాని అదే బుల్లెట్ ఐదు అడుగులు ఉంటే.. అలాంటి రాజకీయ బుల్లెట్టే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి. రాజకీయాలలో గెలిచామా, ఓడామా అన్నది కాదు ముఖ్యం. గట్టిగా నిలబడ్డామా, ధైర్యంగా కలబడ్డామా, పోటాపోటీగా ఎగబడ్డామా, పరిస్థితులను బట్టి తిరగబడ్డామా అన్నదే ముఖ్యం. రాజకీయం నిరంతర చదువు. ఇక్కడ చదువు పూర్తిచేసి డిగ్రీలు పొందడం ఏరోజూ జరగదు. ప్రతిరోజూ చదువుకుంటుండాల్సిందే! ఎలా ఎదగాలో కాదు, ఎక్కడ ఒదగాలో తెలిసినవాళ్ళే ఇక్కడ రాణిస్తారు. రాజకీయమనే గ్రంథంకు మొదటి పేజీ తప్ప చివరిపేజీ ఉండదు. ఈ గ్రంథాన్ని నిరంతరం చదువుతున్న విద్యార్థే సోమిరెడ్డి.

# లీడర్‌కు కాలం కలిసొచ్చేనా?

జిల్లాలో తెలుగుదేశం పార్టీకి గత 20ఏళ్లుగా అతనే కర్త, కర్మ, క్రియ. ఈరోజు పార్టీ అధికారంలోకి వచ్చింది. కాని పార్టీ కోసం ఇన్నాళ్లు శ్రమపడ్డ సోమిరెడ్డి భవిష్యత్ ఏంటనేది ప్రశ్నార్థకంగా మారింది. తెలుగుదేశంపార్టీ కోసం అతను పాకులాడాడు. ప్రత్యర్థులతో పోరాడాడు. పార్టీ కోసం ఓటములు చవిచూశాడు. అవమానాల పాలయ్యాడు. ఆర్థికంగానూ ఎదురుదెబ్బలు తిన్నాడు. 2004లో తెలుగుదేశం ప్రతిపక్షంలోకి పోయింది. తెలుగుదేశం నాయకులుగా వున్నోళ్లు ఒక్కొక్కరుగా ఇతర పార్టీల్లోకి జారుకున్నారు. తెలుగుదేశంకు ఇక భవిష్యత్ లేదని చాలామంది నిర్ధారించేశారు. అలాంటి సమయంలో కూడా సోమిరెడ్డి పార్టీని వద ల్లేదు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధైర్యంగా విమర్శలు గుప్పించడానికి సోమిరెడ్డి ఏనాడూ వెనుకాడ లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు పరాజయం పొందాడు. పార్టీ ఆదేశంతో జడ్పీ ఎన్నికల్లో కూడా దిగాడు. గత పదేళ్లలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా గళం విప్పిన చాలా తక్కువమంది ప్రతిపక్ష నాయకులలో సోమిరెడ్డి ఒకరు. కాని ఈరోజు పార్టీ అధికారంలో ఉంది. సోమిరెడ్డికి పదవే లేకుండా పోయింది. మంత్రి నారాయణ రాజకీయ నాయకుడు కాదు. ఆయనకు రాజకీయ చాతుర్యం తక్కువ. సోమిరెడ్డిలో రాజకీయ చతురతకు కొదవలేదు. కేడర్‌ను పట్టుకుని రాగలడు. కాని చేతిలో పదవే లేదు. పార్టీ భవిష్యత్ అవసరాలకోసమైనా సోమిరెడ్డికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలనే డిమాండ్ పార్టీ కార్యకర్తల నుండి వినిపిస్తుంది. కార్యకర్తలకు అందుబాటులో ఉండే లీడర్ అతనే! సోమిరెడ్డి పవర్‌లో ఉంటే పార్టీ కార్యకర్తల్లో కూడా ఆ ఊపు కనిపిస్తుంది. మరి జిల్లాలో పార్టీని ఉత్తేజపరచడానికి చంద్రబాబు ఏం చేస్తాడో చూడాలి. సోమిరెడ్డికి ఎమ్మెల్సీ ఇస్తే పార్టీ కొంత పుంజుకునే అవకాశముంది. లేదంటే అంతకుముందుకు, ఇప్పటికి, రేపటికి పెద్ద తేడా ఉండదు.

# జలరవాణాలో ఇక బ'కింగ్'

## దక్షిణాసియాలోనే అతిపెద్ద జలరవాణా మార్గానికి కేంద్రం ఆమోదం



మనం బ్యాంకాక్, వెనిస్ వంటి నగరాలను గురించి పత్రికలు, పుస్తకాలలో చదివి ఉంటాం. అక్కడ కాలువల్లోనే మార్కెట్లు వెలిసి ఉంటాయి. కాలువలోనే సరుకల పడవలు వెళుతుంటాయి. వాటిని చూస్తుంటే మన దేశంలోనూ ఇలాం టివి ఉంటే ఎంత బాగుండనిపిస్తుంది. అయితే అటువంటి వాటిని చూడడానికి ఇక మనకు ఎంతోకాలం పట్టకపోవచ్చు. త్వరలోనే ఈ కల సాకారం కాబోతుంది. దక్షిణాసియాలోనే అతిపెద్ద జలరవాణా మార్గమైన బకింగ్‌హాం కెనాల్ పునరుద్ధ రణకు కేంద్రప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ నుండి పుదుచ్చేరి వరకు బకింగ్‌హాం కెనాల్ పునరుద్ధరణకు కేంద్రం నడుంకట్టింది. ఇందుకోసం 1515 కోట్లు మంజూరుచేసింది. మొత్తం ఈ కాలువ పునరుద్ధరణ పనులను ఏడు ప్యాకేజీలుగా విభజించారు. వచ్చేఏడాది ఆరంభం నుండే ఈ ఏడు ప్యాకేజీలలోనూ ఒకేసారి పనులు మొదలుకానున్నాయి. కాబట్టి కాలువ పునరుద్ధరణ, ఆధునీకరణకు పెద్ద సమయం కూడా పట్టకపోవచ్చు. కాకినాడ – పుదుచ్చేరి కాలువకు గోదావరి, కృష్ణా నదీ మార్గాలను కూడా అనుసంధానం చేయనున్నారు. కాకినాడ నుండి తడ వరకు రాష్ట్రంలో మొత్తం 888కిలోమీటర్ల మేర బకింగ్‌హాం కాలువ విస్తరించి వుంది. కేంద్రం దీనిని జాతీయ జలరవాణా మార్గం–4గా గుర్తించింది. దీనికి సంబంధించిన కార్యాలయాన్ని విజయవాడలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

## నెల్లూరు తీరంలో ప్రగతిపథం

ఇప్పటికే కోస్టల్ కారిడార్‌లో చేరిన నెల్లూరుజిల్లాకు బకింగ్‌హాం కెనాల్ ఆధునీకరణ సరికొత్త కళను తేబోతుంది. జిల్లాలో కావలి నుండి తడ వరకు దాదాపు 180కిలోమీటర్ల మేర బకింగ్‌హాం కెనాల్ వుంది. జిల్లాలో మైపాడు, దుగరాజపట్నంల వద్ద టెర్మినల్స్ ఏర్పాటు చేయనున్నారు. ఈ టెర్మినల్స్ ద్వారా సరుకు రవాణా జరుగుతుంది. రోడ్డు, రైలు మార్గాలతో పోలిస్తే జలమార్గం ద్వారా రవాణా ఖర్చులు తగ్గుతాయి. నెల్లూరు నుండి చెన్నైకు నిత్యం బియ్యంతో పాటు ఇతర ధాన్యాలు, చేపలు, రొయ్యలు వెళుతుంటాయి. రోడ్డు టాక్స్‌లు, టోల్ టాక్స్‌లతో తడిసి మోపెడవుతుంది. జలమార్గంలో ఇంత ఖర్చుండదు. అంతేకాకుండా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఆంధ్రా, తమిళనాడుల మధ్య సరకు రవాణా సులభతరమవుతుంది.

# పాస్‌బుక్‌ల పాపానికి

## సస్పెండ్‌ల శాపం తగిలింది!

మన రెవెన్యూ అధికారులు రికార్డులు సక్రమంగా ఉండి, సక్రమంగా వున్న పట్టాభూములకు పాస్‌బుక్‌లివ్వడానికి నెలల కాలాల పాటు తిప్పుకుంటారు. అన్నీ సక్రమంగా వున్న భూములకు పాసు పుస్తకాలివ్వాలన్నా చిల్లరపడాల్సిందే! అదే అటవీ, పోరంబోకు, డికెటి, సిజెఎఫ్ఎస్ భూములకు మాత్రం డబ్బు పడిందంటే చాలా అర్జంట్‌గా పాసు పుస్తకాలు రెడీ అవుతుంటాయి. ఇలా కాసులకు కక్కుర్తిపడి పాసుపుస్తకాలిచ్చే ఒక తహశీల్దార్, ఒక ఆర్ఐ, ఒక విఆర్ఓ సస్పెండ్‌కు గురయ్యారు.

వివరాలలోకి వెళితే విడవలూరు మండలం వరిణి రెవెన్యూ గ్రామంలో సర్వేనెంబర్ 910/1లో 125.68 ఎకరాల రిజర్వ్ అటవీభూమి ఉంది. ఈ భూమిలో కొట్టే విజయ పేరుతో 17.20 ఎకరాలకు, కొట్టే కుసుమకుమారి పేరుతో 49.25ఎకరాలకు తహశీల్దార్ కోటేశ్వర రావు అక్రమంగా పట్టాలిచ్చి పాస్‌బుక్‌లు కూడా మంజూరు చేశారు. దీనిపై స్థానికులు కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ వెంటనే స్పందించి అదనపు జాయింట్ కలెక్టర్ ఆర్.ఎస్.రాజ్‌కుమార్‌ను దీనిని విచారించమని ఆదేశించారు. ఏజేసీ దీనిని విచారించి తహశీల్దార్ పట్టాలిచ్చింది రిజర్వ్ అటవీ భూమేనని నివేదిక ఇచ్చారు. దీంతో విధుల నిర్వహణలో అక్రమాలకు పాల్పడిన విడవలూరు తహశీల్దార్ టి.కోటేశ్వరరావును అప్పటి ఆర్ఐ పి.రాజేష్‌ను, విఆర్ఓ కె.సుబ్బయ్యను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.




# డాక్టర్ కాన్డే యెమ్‌కుల్లాకు నాయుడమ్మ అవార్డ్



నెల్లూరులోని నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్ సంస్థ ప్రతి యేటా అందించే ప్రతిష్టాత్మక నాయుడమ్మ అవార్డును ఈ సంవత్సరం ఐక్యరాజ్యసమితి అండర్ సెక్రటరీ జనరల్, సస్టైనబుల్ ఎనర్జీ ఫర్ ఆల్ సిఇఓ. డా।। కాన్డే యెమ్‌కుల్లాకు నవంబర్ 13వ తేదీన చెన్నైలో ప్రదానం చేస్తున్నట్లు సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఎ.జగదీష్ తెలిపారు. ఈ అవార్డును కేంద్ర పట్టణాభివృద్ధి, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి యం.వెంకయ్యనాయుడు అందజేస్తారు. ఈ కార్యక్రమంలో షార్ సెంటర్ డెరెక్టర్ డా।। ఎం.వై.యస్.ప్రసాద్, హైదరాబాద్‌లోని సిఆర్ రావ్ అడ్వాన్స్‌డ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మాథమేటిక్స్, స్టాటిస్టిక్స్ కంప్యూటర్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ అల్లం అప్పారావు పాల్గొంటారు. డాక్టర్ కన్డే యెమ్‌కుల్లా సియరాలియోన్ దేశస్థుడు. యూనివర్సిటి ఆఫ్ ఇల్లినాయిస్(అమెరికా) నుండి డాక్టరేట్ అగ్రికల్చరల్ జనరల్‌గా పనిచేశారు. యునిడోలో చేరక ముందు ట్రేడ్, ఇండస్ట్రీ అండ్ స్టేట్ ఎంటర్ ప్రైజెస్ సియరాలియోన్ మంత్రిగా పనిచేశారు. ప్రతిష్టాకరమైన ది ప్రిక్స్ డె లా ఫౌండేషన్ ఆఫ్ ది క్రాన్స్ మొంటానా ఫోరమ్ అవార్డుతో పాటు పలు అంతర్జాతీయ అవార్డులు అందుకున్నారు.

## కొత్తగా ఆరుమంది డిఎస్పీలు

జిల్లాకు అదనంగా మరో ఆరుగురు డిఎస్పీలు రానున్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒక డిఎస్పీని పెట్టనున్నారు. ఇప్పటికే నెల్లూరు నగరం, నెల్లూరురూరల్, కావలి, గూడూరు, ఆత్మకూరు లకు డిఎస్పీలు ఉన్నారు. మిగిలిన నియోజకవర్గాలు సూళ్లూరుపేట, ఉదయగిరి, వెంకటగిరి, సర్వేపల్లి, కోవూరులకు కూడా డిఎస్పీలను కేటాయిస్తారు. అలాగే జిల్లాకు ట్రాఫిక్ డిఎస్పీని నియమించనున్నారు. నియోజకవర్గానికొక డిఎస్పీ వస్తే పరిధి బాగా తగ్గి డిఎస్పీ పోస్టు ప్రస్తుత సిఐ పోస్టు స్థాయిలో ఉంటుంది.

## కలెక్టరేట్ ఏఓ బదిలీ

జిల్లా కలెక్టరేట్‌లో పరిపాలనాధికారిగా పనిచేస్తున్న రమేష్‌నాయుడు తన సొంత జిల్లా గుంటూరుకు బదిలీ అయ్యారు. ఏడాదిన్నర క్రితం ఆయన ఇక్కడ ఏఓగా వచ్చారు. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక తనను గుంటూరుజిల్లాకు బదిలీ చేయాలంటూ ఆయన దరఖాస్తు పెట్టుకున్నారు. ఆమేరకు బదిలీ జరిగిపోయింది.

## స్టాండింగ్ కమిటి ఎన్నికలకు నోటిఫికేషన్

నెల్లూరు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటి ఎన్నికలకు కమిషనర్ చక్రధర్‌బాబు నోటిఫికేషన్ విడుదల చేశారు. నవంబర్ 5 నుండి 12వరకు నామినేషన్లు జరుగుతాయి. 13న స్క్రూట్నీ ఉంటుంది. 15న నామినేషన్ల ఉపసంహరణ, అనంతరం జాబితా విడుదల ఉంటుంది. 19వతేదీ ఉదయం10గంటల నుండి మధ్యాహ్నం 3గంటల వరకు ఎన్నికలు జరుగుతాయి. ఆరోజే ఫలితాలు వెల్లడిస్తారు. అయితే మేయర్ అజీజ్‌తో సంబంధం లేకుండానే కమిషనర్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లుగా తెలుస్తుంది. అధికారపార్టీ కార్పొరేటర్లపై మేయర్‌కు పట్టులేదు. వారిని ఓ దారికి తెచ్చుకోకుండానే స్టాండింగ్ కమిటి ఎన్నికలకు పోతే పరిస్థితులు ఎలా మారుతాయోనని మేయర్ ఆందోళనలో ఉన్నారు.


## ఐదుకోట్లు.. సంగతేంటి

### కార్పొరేషన్ అధికారులపై కోటంరెడ్డి మండిపాటు


రిలయన్స్ తీసిన గుంతలను పరిశీలిస్తున్న కోటంరెడ్డి

రిలయన్స్ సంస్థ కేబుల్ పనుల నిమిత్తం తీసిన గుంతలు పూడ్చేందుకు కార్పొరేషన్‌కు ఇచ్చిన ఐదుకోట్ల రూపాయలు ఏమయ్యాయని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం నెల్లూరులోని రూరల్ పార్టీ కార్యాలయంలో విలేకర్లతో కోటంరెడ్డి మాట్లాడుతూ కొందరు అధికారుల అవినీతి, అలసత్వం వల్ల నెల్లూరు నగర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రిలయన్స్ సంస్థ తీసిన గోతులు పూర్తిస్థాయిలో మూసివేసి యధాస్థితికి తెచ్చేందుకు కార్పొరేషన్‌కి రూ. 4.96కోట్లు ఇచ్చిందన్నారు. ఆ కోట్లు ఏమయ్యాయో తెలియదని, గుంతలు మాత్రం అలాగే ఉన్నాయన్నారు. కార్పొరేషన్‌కు ఐఏఎస్ అధికారి వచ్చారని, ఇక్కడ జరిగే వ్యవహారాలపై దృష్టి సారించాలని కమిషనర్‌ను కోరారు. గుంతలు పూడ్చేందుకు ఇచ్చిన నగదు ఏమయ్యాయో తెలుసుకోవాలన్నారు. సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, వెంటనే రిలయన్స్ తీసిన గుంతల పూడికపనులు ప్రారంభించాలని కోరారు. లేకుంటే రిలయన్స్ సంస్థ చేస్తున్న కేబుల్ పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నగర అధ్యక్షుడు తాటి వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక దీపోత్సవానికి ఉభయకర్త పేరే మార్చేసారు!




నెల్లూరు మూలాపేటలోని శ్రీ భువనేశ్వరీ సమేత మూల స్థానేశ్వరస్వామి దేవస్థానంలో ప్రతి ఏటా కార్తీక మాసపూజలు అత్యంత వైభవంగా జరుగుతుంటాయి. ఈ ఏడాది కూడా అక్టోబర్24నుండి నవంబర్ 22వరకు ఈ ఆలయంలో కార్తీక మాస పూజలు జరుగుతున్నాయి. కార్తీకమాసం ప్రారంభంలో ధ్వజస్థంభం వద్ద దీపారాధనకు శాశ్వత ఉభయకర్తగా ప్రముఖ అడ్వకేట్ వరిదిరెడ్డి కృష్ణమోహన్ ఉన్నారు. అయితే ఈసారి ఆలయ అధికారులు ధ్వజస్థంభ దీపం ఉభయకర్తగా కృష్ణమోహన్‌కు బదులు మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి పేరును కరపత్రాలలో ప్రచురించారు. అయితే నగర ఎమ్మెల్యే అనిల్ కుమార్ చేత దీపారాధన చేయించారు. 20ఏళ్లుగా వరిదిరెడ్డి కృష్ణమోహన్ ధ్వజస్థంభం దీపం ఉభయకర్తగా వ్యవహరిస్తున్నారు. కార్తీకమాసంలో నెలరోజుల పాటు ఈ దీపారాధన వాళ్లే నిర్వహిస్తుంటారు. మధ్యలో ఒక ఏడాది మాత్రం ఆనం వివేకానందరెడ్డి ధ్వజస్థంభ దీపం ఉభయకర్తగా వ్యవహరించినా కృష్ణమోహన్ అభ్యంతరం పెట్టలేదు. 9ఏళ్ల క్రితం ధ్వజస్థంభ దీపం శాశ్వత ఉభయకర్తగా ఉండేందుకు కృష్ణమోహన్ దేవస్థానానికి 1,10,116రూపాయలు చెల్లించి ఉన్నారు. అయితే ఈ సంవత్సరం అనూహ్యంగా ఉభయకర్తగా ఆయనను తీసేసి ఆనం వివేకానందరెడ్డి పేరును చేర్చడంతో కృష్ణమోహన్ నిరసన వ్యక్తం చేశారు. ఆలయ ఇఓ తన పేరును ఉభయకర్తగా ప్రకటించకపోతే న్యాయపోరాటానికి దిగుతానని ఆయన హెచ్చరించారు. ఈ సంవత్సరమంటే ఎలాగో గడిచిపోయింది. కనీసం వచ్చే కార్తీకమాసానికైనా సంప్రదాయం ప్రకారం కృష్ణమోహన్‌రెడ్డి పేరును దీపారాధన ఉభయకర్తగా ప్రకటించదానికి ఆలయ ఇఓ చర్యలు తీసుకోవాల్సివుంది. లేకుంటే ఉభయకర్తల మనోభావాలు దెబ్బతింటాయి.

## బిఎస్ఎన్ఎల్ జిఎంగా వెంకటనారాయణ

బిఎస్ఎన్ఎల్ నెల్లూరుజిల్లా జనరల్ మేనేజర్‌గా వై.వెంకటనారాయణ సోమవారం నెల్లూరులోని సంస్థ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. తిరుపతిలో ఏజిఎంగా పనిచేస్తూ పదోన్నతి మీద ఆయన ఇక్కడకు బదిలీ అయ్యారు. ఐదు నెల క్రితం జిఎంగా వున్న గోపీ ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుండి మొన్నటిదాకా ఒంగోలు జిఎం మునీంద్రనాథ్ నెల్లూరుజిల్లా ఇన్‌ఛార్జ్ జిఎంగా బాధ్యతలు నిర్వర్తించారు. కొత్త జిఎం వెంకటనారాయణను సంస్థ అధికారులు, సిబ్బంది, ఉద్యోగసంఘాల నాయకులు కలిసి అభినందించారు.

# నెల్లూరు కబుర్లు



## సిబ్బంది చేత ప్రమాణం చేయించిన ఎస్పీ

జిల్లా పోలీసుశాఖలో సంస్కరణలకు ఎస్పీ సెంథిల్‌కుమార్ పెద్దపీట వేస్తున్నారు. తాను నీతిగా ఉండడమే కాదు, పోలీసులంతా కూడా నీతిగా ఉండి పనిచేస్తేనే ఫలితాలుంటాయనేది ఆయన అభిప్రాయం. అందుకే కొంతలో కొంతయినా ఫలిత ముంటుందని పోలీసులందరి చేత నీతిగా పనిచేస్తామని, దేశ భద్రత, సమగ్రతకు కృషి చేస్తామని, శాంతిభద్రతలకు పాటుపడతామని చెప్పించి ప్రమాణం చేయిస్తున్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని మినిస్టీరియల్ సిబ్బంది, ఏఆర్, డిసిఆర్‌బి సిబ్బందితో ఆయనే స్వయంగా ప్రతిజ్ఞ చేయించారు. అలాగే అన్ని సబ్‌డివిజన్‌లలో సర్కిల్ కార్యాలయాలు, పోలీసు స్టేషన్‌లలో సిబ్బంది చేత ప్రమాణం చేయించి, ఆ ఫోటోలను వాట్సప్‌లో తనకు పంపించాలని ఆయన పోలీసు అధికారులకు సూచించారు.

## సైకత శివలింగానికి పూజలు



పవిత్ర కార్తీకమాసాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని పెన్నానదిలో పినాకిని స్విమ్మర్ అసోసియేషన్ వాళ్లు సోమవారం సైకత శివలింగాన్ని ఏర్పాటు చేశారు. శివలింగానికి పాలు, పెరుగు, పన్నీరు, తేనె, విభూతి, గంధం, కొబ్బరినీళ్లు, పంచామృతంతో అభిషేకం నిర్వహించి ప్రత్యేకపూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు, రాజీయాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య, కార్పొరేటర్లు నూనె మల్లిఖార్జునయాదవ్, పి.రూప్‌కుమార్, శేషు, రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ముత్తుస్వామి దీక్షితార్ ఆరాధనోత్సవాలు



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర భాష సాంస్కృతికశాఖ, నెల్లూరు ప్రభుత్వ సంగీత నృత్యపాఠశాల ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్‌హాలులో సోమవారం నుండి బుధవారం వరకు మూడురోజులు ముత్తుస్వామి దీక్షితార్ ఆరాధనోత్సవాలు వైభవంగా జరిగాయి. 27వ తేదీ జరిగిన సభా కార్యక్రమంలో దేవరాల మస్తానమ్మ, వొమ్మిన సతీష్‌బాబు పాల్గొన్నారు. 2014 'పాడుతాతీయగ' ద్వితీయ బహుమతి విజేత కుమారి సర్వేపల్లి శ్రేయ ఆలపించిన గానం అందరిని ఆకట్టుకుంది. 28వ తేదీ జరిగిన సభా కార్యక్రమానికి దేవరాల సుబ్రహ్మణ్యం, జి.కృష్ణమోహన్ పాల్గొన్నారు. అనంతరం చెన్నైకి చెందిన ఎ.కె.మహేష్ గాత్రకచ్చేరి అలరించింది. 29వ తేదీ జరిగిన సభా కార్యక్రమంలో వొమ్మిన సుబ్రహ్మణ్యం, పెళ్లూరు సుధాకరరెడ్డి, పి.సాయిప్రసాదులు పాల్గొన్నారు. అనంతరం మోదుమూడి సుధాకర్ గాత్రకచ్చేరి అందరిని ఆకట్టుకుంది. ఈ మూడురోజులు ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల విద్యార్థిని విద్యార్థులు వి.జె.సాయికుమారి, సాయినయన సహిష్ట, రషితప్రియ గాత్రకచ్చేరి, బాలరత్న పిడవర్తి శివకుమార్ గాత్రకచ్చేరి, చిరమన సాయి హేమంతకృష్ణ నాశికా వేణుగానం సభికులను ఓలలాడించింది. ఈ మూడురోజులు కార్యక్రమానికి వ్యాఖ్యాతగా సహస్రసభాసింహం బి.వి.నరసింహం వ్యవహరించారు. పాఠశాల ప్రిన్సిపల్ సి.మునికుమార్, అధ్యాపకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

# రుణమాఫీ లక్ష్యంగా వైయస్సార్సీపీ పోరుబాట



సమావేశంలో ప్రసంగిస్తున్న ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు. పక్కన వి.విజయసాయిరెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

రైతు, డ్వాక్రా, చేనేత రుణాల మాఫీ లక్ష్యంగా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ పోరుబాట మొదలుపెట్టింది. గ్రామస్థాయి నుంచి కార్యక్రమాలను రూపొందించేందుకు సిద్ధమైంది. మంగళవారం నెల్లూరులో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో చంద్రబాబునాయుడు చేస్తున్న ప్రకటనలను ఎండగట్టాలని నిర్ణయించారు. తెల్లరేషన్ కార్డుల పునరుద్ధరణ, పింఛన్లు, ఎన్టీఆర్ సుజల స్రవంతి తదితర అంశాలపై నిలదీయాలని వచ్చే నెల 5న జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నారని ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు విమర్శించారు. మొదట వ్యవసాయ రుణాలని చెప్పి ఆ తర్వాత పంటరుణాల మాఫీ అంటూ కుటుంబంలో ఒకరికి లక్షన్నర రూపాయలకు పరిమితం చేసిన తీరుపై మండిపడ్డారు. వ్యవసాయ సాధికారత కమిషన్ ఏర్పాటు చేయడం వల్ల రైతులకు వడ్డీభారం తప్ప మరొకటి లేదని, ఈ విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చంద్రబాబు బండారాన్ని బయటపెట్టాలని, ఇందులో భాగంగా వచ్చేనెల 5న తల పెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని వైయస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణుంబాక విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. వైయస్సార్సీపీ సేవా దళాన్ని ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటుచేసి స్వచ్ఛంధంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వైయస్సార్సీపీ పటిష్టత కోసం పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్టం చేసేందుకు విజయసాయిరెడ్డి, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు.

## పోర్టు ఎస్ఐపై వేటు

కృష్ణపట్నం పోర్టు నుండి బొగ్గు అక్రమరవాణా కేసు విచారణలో నిర్లక్ష్యం వహించినందుకు పోర్టు ఎస్ఐ కె.వెంకటరెడ్డిని సస్పెండ్ చేస్తూ గుంటూరురేంజ్ ఐజి సునీల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణపట్నం పోర్టు నుండి రవాణా జరిగే బొగ్గులో అక్రమాలు జరిగాయి. లారీ డ్రైవర్లతో కొందరు సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది కుమ్మక్కై నిర్ణీత లోడు కంటే అదనంగా లారీలకు బొగ్గులోడ్ చేసి బయటకు పంపసాగారు. పోర్టు అధికారులకు ఇది తెలిసి లారీలపై నిఘాపెట్టి 12లారీలను పట్టుకున్నారు. 14నెలలు గడిచినా కేసులో పురోగతి లేకపోవడంతో పోర్టు యాజమాన్యం డిజిపి జె.వి.రాముడికి ఫిర్యాదు చేసింది. ఎస్పీ దీనిపై నివేదిక పంపారు. కేసు విచారణలో అలసత్వం చూపినందుకు ఎస్ఐను సస్పెండ్ చేశారు.

# నెల్లూరుకు కీర్తిపతాక శ్రేయ

## పాడుతాతీయగా విజేత శ్రేయకు అభినందన




పాడుతాతీయగా–2014 పోటీలలో నెల్లూరుకు చెందిన సర్వేపల్లి శ్రేయ ద్వితీయస్థానంలో నిలిచి సింహపురి కీర్తి ప్రతిష్టలను దేశం నలుమూలలా ఇనుమడింపజేసింది. ఈ సందర్భంగా భిక్షాటన పూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవసభ, కళాంజలి సాంస్కృతిక సంస్థ సంయుక్తంగా ఆదివారం నెల్లూరు టౌన్‌హాల్‌లో అభినందన సభ నిర్వహించాయి.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నెల్లూరు నగర, రూరల్ ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి తదితరులు పాల్గొని శ్రేయను పూలమాల, పూలకిరీటం, మొమెంటో, సన్మానపత్రంతో సన్మానించారు. తొలుత సంగీత కళాకారులు జ్యోతి ప్రకాశనం చేశారు. మణికంఠసాయి, మధుబాబు, డాక్టర్ రంజని, హంసిని, సర్వేపల్లి రాజలక్ష్మి, శ్వేతలు ఆలపించిన అలనాటి సుమధురగీతాలు ప్రేక్షకులను అలరించాయి. నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ భారతదేశం గర్వించదగ్గ కళాకారిణిగా సర్వేపల్లి శ్రేయ రాణించాలన్నారు. పాశ్చాత్య సంగీతానికి ఆకర్షితులై యువత భారతీయ సంస్కృతిని మరచిపోతున్నారన్నారు. నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమాన్ని ఒక పాట కదిలించిందని, ప్రజాఉద్యమాన్ని ఉరకలెత్తించిందన్నారు. కళాకారులకు పెన్షన్, ఇళ్ల స్థలాలు, గుర్తింపుకార్డుల మంజూరుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ దాదాపు రెండు దశాబ్దాలుగా నెల్లూరీయుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడుతా తీయగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, ఎంతోమంది కళాకారులకు వేదికైందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఉష, కారుణ్య, గోపికాపూర్ణిమ, ప్రవళిక, మల్లిఖార్జున్, ఇంకా ఎంతోమంది కళాకారులు చిత్రపరిశ్రమలో గాయకులుగా పేరు సంపాదించుకున్నారన్నారు. 'పాడుతా తీయగా'లో సర్వేపల్లి శ్రేయ విజయం సాధించడం వెనుక శ్రేయ తల్లిదండ్రుల పాత్ర ఎంతో ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో నెల్లూరుజిల్లా బిసి సంఘం అధ్యక్షుడు దేవరాల సుబ్రహ్మణ్యం, కుర్తాళం పీఠాధిపతి మాచవోలు రాజశేఖరశాస్త్రి, నగర డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్, రామ్మోహన్‌రావు, చతుర్వేదుల శ్రీరామమూర్తి మాట్లాడారు. భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవసభ కార్యదర్శి డాక్టర్ వై.నాగదేవి ప్రసాద్, కళాంజలి సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకులు అనంత్ పర్యవేక్షించారు. దువ్వూరు బెనర్జీ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. శర్మ, అరుణ్‌లు సహకరించారు.

ఈ సందర్భంగా శ్రేయ తండ్రి డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్‌ని కూడా అతిథులు ఘనంగా సత్కరించారు.



## 'లాయర్' ఆధ్వర్యంలో
# విజయవంతంగా వ్యాసరచన పోటీలు

మాజీప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 125వ జయంతిని పురస్కరించుకుని 'లాయర్' వారపత్రిక ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరు టౌన్‌హాల్‌లో నెహ్రూ జీవితవిశేషాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలల నుండి దాదాపు 500మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో విద్యార్థులకు అనేక అంశాలపై పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు, కన్సొలేషన్ బహుమతులు క్రింద పదిమందికి ఒక్కొక్కరికి రూ.500లు చొప్పున నవంబర్ 14వ తేదీ టౌన్‌హాల్‌లో జరిగే నెహ్రూ జయంతి సందర్భంగా చిన్నారుల విజయదీపిక పుస్తకావిష్కరణ అనంతరం విజేతలకు బహుమతులు, పోటీలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి సర్టిఫికేట్లు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు ప్రైవేట్ స్కూల్స్‌ను అభినందించిన మంత్రులు



హుద్‌హుద్ తుఫాన్ బాధితుల సహాయార్థం నెల్లూరుజిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ 32లక్షల రూపాయల విరాళాన్ని బుధవారం విశాఖపట్నంలో రాష్ట్ర పురపాలకశాఖామంత్రి పి.నారాయణ, రాష్ట్ర విద్యాశాఖమంత్రి గంటా శ్రీనివాసరావులకు అందజేసింది. విశాఖలోని రామకృష్ణ స్కూల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.మనోహర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు యం.వి.సుబ్బారెడ్డి, రాష్ట్ర గౌరవాధ్యక్షులు కృష్ణారెడ్డి, కరస్పాండెంట్లు ఎన్.శ్రీధర్, కృష్ణారెడ్డి, పద్మనాభరెడ్డి, మనోహర్‌రెడ్డి, కొండారెడ్డిలు ఈ విరాళాన్ని మంత్రులకు అందజేశారు. ఈ సందర్భంగా ఇరువురు మంత్రులు ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ విరాళాలలో నేతాజీ పైలెట్ స్కూల్ 2లక్షలు, మైథిలి స్కూల్ లక్షా 82వేలు, విబిఆర్ స్కూల్ లక్షా30వేలు, మాడరన్ స్కూల్ లక్షా25వేలు, అజంతా స్కూల్ లక్షా 25వేలు, శిల్ప ఆంగ్లోఫిల్ స్కూల్ లక్ష, కెబిఆర్ స్కూల్ 50వేలు, సెయింట్‌మేరీస్ స్కూల్ 45వేలు, గీతాంజలి స్కూల్ 37వేలు, నెహ్రూనికేతన్ స్కూల్ 33వేలు, విశ్వంస్కూల్ 30,300, శ్రీచైతన్య స్కూల్ 25వేలు, వేళాంగణి స్కూల్ 21వేలు, శంకర్ స్కూల్ 20వేలు, న్యూవిద్యాభారతి స్కూల్ 20వేలు, ఎస్‌విఆర్ స్కూల్ 20వేలు, శ్రీచక్ర స్కూల్ 17వేలు, సాయిమహావిద్యాలయ 15,500, వియస్ఆర్ స్కూల్ 15వేలు, సింహపురి స్కూల్ 13వేలు, సంఘమిత్ర స్కూల్ 11వేలు, విశ్వభారతి స్కూల్ 10,150, వెంకటాద్రి స్కూల్ 10వేలు, నలంద స్కూల్ 7వేలు, సెయింట్ ఆంథోని స్కూల్ 6వేలు, రామానుజన్ స్కూల్ 4వేలు ఇచ్చివుండడం విశేషం.

# కలెక్టర్‌కు ఆనం విరాళాలు



హుద్‌హుద్ తుఫాను బాధితులను ఆదుకునేందుకు మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, నెల్లూరుజిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కె.ధనుంజయరెడ్డి ప్రజల నుంచి సేకరించిన విరాళాలను మంగళవారం నెల్లూరుజిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆనం వివేకానందరెడ్డి మాట్లాడుతూ నెల్లూరుప్రజలు రూ.5,21,730లు నగదును, మెడికల్ అసోసియేషన్ వారు లక్ష రూపాయలు విలువగల మందులను, ఏసి మార్కెట్ వ్యాపారులు రూ.3లక్షల విలువచేసే బియ్యం ఇచ్చారన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# ప్రతిఒక్కరూ ఒక్క మొక్కనైనా నాటాలి


మొక్కలను నాటుతున్న ఎమ్మెల్యే, ఛైర్‌పర్సన్

మానవాళి మనుగడకు మొక్కలే ఆధారమని, ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క మొక్కనైనా నాటాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన తెలిపారు. గూడూరు రెండవ పట్టణం, 32వ వార్డులోని అండర్ బ్రిడ్జి నుంచి కోర్టు కూడలి వరకు ఆదివారం మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని చెప్పారు. పట్టణంలో పచ్చదనం ఉండేలా అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైకాపా రాష్ట్ర నాయకుడు మరియు 25వ వార్డు కౌన్సిలర్ ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, 32వ వార్డు కౌన్సిలర్ నాశిన నాగులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# బాధితులను ఆదుకున్న దాతలు


ఎమ్మెల్యేకు రూ.లక్ష చెక్కును అందజేస్తున్న కనుమూరు హరిచంద్రారెడ్డి ట్రస్టు సభ్యులు

ప్రజలకు మంచి జరిగే ప్రతి కార్యక్రమానికి ఎలాంటి స్వార్థం లేకుండా సాయం చేస్తున్న కనుమూరు హరిచంద్రారెడ్డి, కోట సునీల్‌కుమార్ అందరికీ ఆదర్శంగా నిలుస్తారని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. అశోక్‌నగర్ ప్రాంతంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఇటీవల హుద్‌హుద్ తుఫాను బాధితులను ఆదుకునేందుకు కనుమూరు హరిచంద్రారెడ్డి ట్రస్టు ద్వారా రూ.లక్ష చెక్కును ట్రస్టు సభ్యులు ఎమ్మెల్యేకు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో జరిగే అభివృద్ధి పనులకు తనవంతు సాయంగా హరిచంద్రారెడ్డి ఎంతో సేవచేస్తున్నారన్నారు. సాయి సత్సంగ సేవాసమితి నిర్వాహకులు కోట సునీల్‌కుమార్ కూడా సేవాకార్యక్రమాలను నిర్వహించడంతో పాటు తనవంతు సాయంగా తుఫానుబాధితులకు విరాళాలు అందజేశారని తెలిపారు. అనంతరం హరిచంద్రారెడ్డి ట్రస్టు ఛైర్మెన్ కొణిదల మునిగిరీష్ మాట్లాడుతూ తుఫాను బాధితుల కోసం ఎమ్మెల్యే పాశం సునీల్ జోలె పట్టి విరాళాలు సేకరించడం చూసి ట్రస్టు ద్వారా రూ.లక్ష చెక్కును అందజేశామన్నారు. ట్రస్టు సభ్యులు అనిల్, దయాకర్‌రెడ్డి, శివ, మునిభాస్కర్ ఉన్నారు.

# 47వ గనుల భద్రత వారోత్సవాలు


డైరీని ఆవిష్కరిస్తున్న గనులశాఖ అధికారులు

గనుల్లో ముందస్తు జాగ్రత్తలు చేపట్టడం ద్వారానే ప్రమాదాలను దూరం చేయవచ్చని గనుల శాఖ భద్రత సంచాలకులు ఎస్.కృష్ణమూర్తి తెలిపారు. గూడూరు పట్టణంలోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాలులో ఇటీవల 47వ నెల్లూరు గనుల భద్రతా వారోత్సవాలు ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గనుల్లో పనిచేసే కార్మికులతో పాటు సిబ్బంది తగిన జాగ్రత్తలు పాటిస్తే మేలన్నారు. లీజుదారులు ఖచ్చితమైన నిబంధనలు పాటించాలని సూచించారు. అంతకుముందు గనుల్లో పాటించాల్సిన భద్రతను తెలిపే డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గనుల అసోసియేషన్ అధ్యక్షుడు పొనకా శివకుమార్‌రెడ్డి, డిప్యూటి డిజియమ్ఎస్ సయ్యద్ ఇంతియాజ్ హుస్సేన్, ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, కోశాధికారి భరత్, గోగినేని రమేష్‌బాబు, రాజాయాచేంద్ర, భరత్‌కుమార్, శివకుమార్, సుశీల్‌రెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, సుమంత్‌రెడ్డి, సిలికా గనుల లీజుదారులు శ్రీనివాసాచారి, పురంధర్‌రెడ్డి, కుమారస్వామిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సుమన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లిటిల్ ఏంజెల్స్ విద్యార్థికి
# బంగారు పతకం


బంగారు పతకాన్ని సాధించిన దీపక్‌సాయి, పక్కన కోచ్ బి.రమేష్

సౌత్‌జోన్ స్థాయిలో 2014-15లో శకుంతల పాటిల్ రెసిడెన్షియల్ స్కూల్, హుమనాబాద్ జిల్లా బీదర్‌లో నిర్వహించబడిన ఇంటర్‌స్కూల్ స్పోర్ట్స్&గేమ్స్ కాంపిటిషన్‌లో టి.దీపక్‌సాయి అనే విద్యార్థి లాంగ్‌జంప్ ఈవెంట్‌లో బంగారు పతకాన్ని, 100మీటర్ల స్ప్రింట్‌లో రజత పతకాన్ని సాధించాడని లిటిల్ ఏంజెల్స్ కరస్పాండెంట్ బి.సుబ్రహ్మణ్యంరెడ్డి, వైస్ ఛైర్మెన్ బి.శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు అటు విద్యలోను, ఇటు క్రీడల్లోనూ ఉన్నతంగా రాణిస్తూ తమ పాఠశాల కీర్తిని నాలుగు దిక్కులా ప్రసరింపజేస్తున్నారని, ఇది తమకెంతో గర్వకారణమన్నారు.

## మాలమహానాడు జిల్లా
# అధ్యక్షుడుగా పార్వతయ్య



ఇటీవల నెల్లూరు అభిరామ్ హోటల్ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర పొలిట్‌బ్యూరో అధ్యక్షులు జూపూడి ప్రభాకరరావు, యమ్ఎల్‌సి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడుగా అరవ పార్వతయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు 'లాయర్'కు తెలిపారు. మిగిలిన జిల్లా కమిటీ సభ్యులను ఎన్నుకొని త్వరలో రాష్ట్ర కమిటీకి పంపిస్తారని తెలిపారు.

# భూసమస్యలపై ఫిర్యాదు


తహశీల్దార్‌కు అర్జి సమర్పిస్తున్న అంబేద్కర్ నేషనల్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా కన్వీనర్ కె.పెంచలనాయుడు

గూడూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అర్జీదారులు భూసమస్యలపై అర్జీలు అందజేసినట్లు తహశీల్దార్ వెంకటనారాయణమ్మ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రజావిజ్ఞప్తుల దినం సందర్భంగా సోమవారం పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన పలువురు అర్జీదారులు నివేశస్థలాలు పంపిణీ చేయాలని కోరారు. తొలగించిన పింఛనుదారుల వయస్సు సరిచేసే ప్రక్రియను పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మూ'వీ'క్షణం



# ఈ నెల కీలకం

అక్కినేని కుటుంబానికి నవంబర్ నెల కీలకం కాబోతుంది. నాగార్జున చిన్నకొడుకు అఖిల్ హీరోగా ఆరంగేట్రం చేయబోయే సినిమాకు నవంబర్ 14న ముహూర్తం పెట్టారు. వి.వి. వినాయక్ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందబోతోంది. టాలీవుడ్ ప్రముఖుల సమక్షంలో అఖిల్ సినీరంగ ప్రవేశం జరగబోతుంది.ఆ మరుసటి రోజే 15వ తేదీ నాగార్జున సోలో హీరోగా నటించబోతున్న 'సోగ్గాడే చిన్ని నాయనా' సినిమా మొదలు కానుంది. కల్యాణ్‌కృష్ణ దీనికి దర్శకుడు.



# రామ్‌కు రాం.. రాం..

రామ్‌గోపాల్‌వర్మ దర్శకత్వంలో వచ్చే సినిమాలంటేనే ఈమధ్య హీరోయిన్లు హడలిపోతున్నారు. ఇలా భయపడిపోయే పూనమ్‌కౌర్ ఆయన దర్శకత్వంలో నటించే అవకాశాన్ని వదులుకుంది. ఇటీవల వివాదాస్పదమైన 'సావిత్రి అలియాస్ శ్రీదేవి' సినిమాలో మొదటి ఆప్షన్ పూనమ్‌కే దక్కింది. ఈమెపై కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు కూడా! అయితే సినిమా మధ్యలో తనకంటే చిన్నవాడైన 17యేళ్ల కుర్రాడితో రొమాన్స్ చేసే సీన్‌లో నటించాలి. అంతవరకు ఓకే అన్న పూనమ్, 10ఏళ్ల పిల్లాడి ఊహల్లో శృంగార తారగా మైమరపించాలని స్క్రిప్ట్ మార్చేసరికి ఆమెకు దిమ్మతిరిగి ఈ సినిమా చేయలేనని తప్పుకుందట! ఆమె స్థానంలో అనుస్మృతిని ఎంపిక చేసుకున్నారు.

# లెమన్ మర్చంట్స్ లక్ష విరాళం


ఆర్డీవోకు రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే, ఛైర్‌పర్సన్ ద్వారా అందజేస్తున్న లెమన్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు

గూడూరు బాలాజీ లెమన్ మర్చంట్స్ అసోసియేషన్ వారు తుఫాను బాధితుల సహాయార్థం రూ.లక్ష చెక్కును ఇటీవల ఆర్డీవో శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన విచ్చేసి మాట్లాడుతూ తుఫాను బాధితుల కోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన బాలాజీ లెమన్‌మర్చంట్స్ వారిని అభినందించారు. ఆర్డీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ లెమన్‌మర్చంట్స్ అందించిన చెక్కును సిఎం సహాయనిధికి పంపనున్నట్లు తెలిపారు. వరిదిరెడ్డి సుబ్బారెడ్డి తుఫానుబాధితులకు అందజేసిన రూ.25వేల చెక్కును ఛైర్‌పర్సన్ దేవసేన ఆర్డీవోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్‌సిపి సిఇసి సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, లెమన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తలమంచి సిద్దారెడ్డి, బిల్లు పెంచలయ్య, టిడిపి నాయకులు పొనకా శివకుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు నాశిన నాగులు, బిల్లు చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

దూరప్రయాణాలు నిర్ణయం కావడం, ఆత్మీయులను, బంధువులను కలుసుకొనడం జరుగుతుంది. ఉపాధి పథకాలు సామాన్యంగా సాగిపోతుంటాయి. అనుకున్న పనులు నిదానంగా జరగడం, ఆటంకాలు కలిగి తొలగడం, తద్వారా టెన్షన్ ఉండటం జరుగుతుంది. ఆదాయం స్వల్పంగా పెరగడం జరుగుతుంది. ఓర్పు, విజ్ఞతతో సమస్యలు సర్దుబాటు చేసికోవాల్సి వుంటుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

అవసరాలకు ఋణాలు చేయవలసి వస్తుంది. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. దూరప్రయాణాలు, బంధుమిత్రులను కలుసుకొనడం జరుగుతుంది. వృత్తి పరంగా గౌరవప్రతిష్టలు, ఆదాయం బాగుంటుంది. వ్యాపార విస్తరణ, క్రొత్త పెట్టుబడుల ప్రయత్నాలు సాగిస్తారు. వ్యాపార వర్గాలకు అవకాశాలు బాగుండి ఆదాయం పెరుగుతుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

స్థిరాస్తుల లావాదేవీలు జరుగుతాయి. షేర్లు పెట్టుబడుల మీద ఆదాయం సంతృప్తికరంగా ఉండదు. అనుకున్న పనులకు పరిస్థితులు అనుకూలించి నెరవేరగలవు. మీ సలహాలు సూచనల వల్ల ఇతరులు లాభం పొందుతారు. వృత్తి వ్యాపారాలలో ఆర్థికాభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. ఋణాలు, పన్నులు, ఫీజులు చెల్లింపులు జరుపుతారు. ఆరోగ్యం ఫరవాలేదు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఉద్యోగ బాధ్యతలందు అదనపు పనిభారం ఉంటుంది. ఉద్యోగులు పబ్లిక్‌తో జాగ్రత్తపడాలి. స్థిరాస్తుల క్రయ విక్రయాలపై ఆలోచనలు, చర్చలుంటాయి. రాబడికి తగ్గట్లు ఖర్చులు సర్దుబాటు చేసికొంటారు. వ్యాపార వర్గాలకు ఆర్థికావకాశాలు వాయిదా పడే స్థితి ఉన్నది. బంధువర్గాలతో వివాదాలు రాకుండా చూచుకొనాలి. విద్యార్థులు ప్రగతి చూపుతారు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

కీలక విషయాలపై బాగా ఆలోచించి నిర్ణయం చేయండి. వృత్తి ఉద్యోగాలలో పురోగతి, గౌరవ ప్రతిష్ఠలు బాగుంటాయి. ఇంటా బయట స్త్రీలకు పురుషులకు సమస్యలుంటాయి. లౌకికముగా పరిష్కరించుకొనడం మంచిది. సోదరులకు మేలు చేకూరుతుంది. ఆస్తి వ్యవహారాలు పరిష్కారానికి రాగలవు. బిడ్డల విద్యా ఉద్యోగ విషయాలపై దృష్టిపెడతారు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

కుటుంబసభ్యులతో అరమరిక, సఖ్యత సరిగా ఉండక పోవచ్చును. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కావచ్చును. ఉద్యోగులు, వ్యాపారులపై అధికారుల దాడులుండవచ్చును. వ్యాపారవృద్ధి అవకాశాలు మరియు ప్రయత్నాలు వాయిదా పడతాయి. అనుకోని అదనపు ఖర్చులుండినా ఇబ్బందులుండవు. అనుకున్న పనులు ధైర్యంగానే జరుపుకొంటారు. షేర్లపై లాభాలుంటాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 31.10.2014 నుండి
తేది. 06.11.2014 వరకు

ఈ వారం మీనంలో కేతువు, కర్కాటకంలో గురువు, కన్యలో రాహు బుధులు, 4తేది నుండి తులలో బుధుడు, తులలో రవిశుక్ర శనులు, 1తేది నుండి వృశ్చికంలో శని, ధనుస్సులో కుజుడు, మకర కుంభ మీన మేష రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 6 గురువారము కార్తీక పూర్ణిమ
శుక్రమౌఢ్యమి జరుగుచున్నది.

### కార్తీక మాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 31 | శుక్ర | అష్టమి | సా॥గం.6.01వ॥ |
| తేది. 01 | శని | నవమి | సా॥గం.3.40వ॥ |
| తేది. 02 | ఆది | దశమి | ప॥గం.1.16వ॥ |
| తేది. 03 | సోమ | ఏకాదశి | ప॥గం.10.56వ॥ |
| తేది. 04 | మంగళ | ద్వాదశి | ఉ॥గం.8.43వ॥ |
| తేది. 05 | బుధ | త్రయోదశి | ఉ॥గం.6.38వ॥ |
| | పిదప | చతుర్దశి | రా॥గం.4.45వ॥ |
| తేది. 06 | గురు | పూర్ణిమ | రా॥గం.3.28వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వృత్తిపరంగా ఆటంకాలు తొలగి వ్యాపకం పెరుగుతుంది. అదనపు ఖర్చులు అనుకోకుండా పైనబడతాయి. క్రొత్త వ్యాపారాలు, ప్రాజెక్ట్‌లకు అవకాశాలు అనుమతులుంటాయి. వ్యాపారవర్గాలకు ఆదాయము బాగుంటుంది. వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగులకు పనిభారం, అదనపు బాధ్యతలుంటాయి. ఆస్తి వ్యవహారాలు వాయిదా వేసుకొనడం మంచిది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆర్థిక ఇబ్బందులుంటాయి. ఇతరుల వ్యవహారాలలోకి పోయి ఇబ్బందులుపడే అవకాశం ఉంది. రావలసిన బాకీలపై వత్తిడి పెంచండి. ఈ రాశివారికి ఆదాయం సామాన్యం. బంధుమిత్రులకు భేదాభిప్రాయాలుంటాయి. ఆర్థిక వ్యవహారాలలో తొందరపడవద్దు. అవసరాలకు ఋణాలు చేయవలసి వస్తుంది. ఉద్యోగార్థుల కొత్త ప్రయత్నాలు వాయిదాపడతాయి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

సభలు, సమావేశాలలోను, శుభకార్య నిర్ణయంలోను ప్రముఖంగా వ్యవహరిస్తారు. ఇతరుల పనులపై ప్రయాణాలుంటాయి. అనుకున్న పనులు సక్రమంగా జరుగుట, సమస్యలపై సంప్రదింపులు జరుపుట, రాజీ చేసుకొనడం జరుగుతుంది. ఆదాయవృద్ధి కలదు. స్థిరాస్తుల మీద ఆదాయముంటుంది. కోర్టు కేసులందు అనుకూలత కలదు. ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఉద్యోగులకు అధికారుల సహకారం బాగుండినా సహచరులతోను, పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. మాట తొందర తగ్గించుకొంటే అందరూ సహకరిస్తారు. మీరు చేసే అన్ని ప్రయత్నాలకు పరిస్థితులు అనుకూలించగలవు. ఆర్థిక లావాదేవీలు, క్రొత్త వ్యాపార ప్రయత్నాలు అనుకూలిస్తాయి. వృత్తి వ్యాపారాలందు ఆదాయం పెరుగుతుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

షేర్లు పెట్టుబడులందు కొంత నిరుత్సాహం ఉంటుంది. ప్రభుత్వ అనుమతులు పొందగలరు. నిర్మాణాలు, రిపేర్లు చేపట్టిన వారికి అంచనాలు కంటే ఖర్చులు ఎక్కువ కాగలవు. పనులు చేసేటప్పుడు ముందు వెనుకలు ఆలోచించి చేయండి, లేకుంటే విమర్శలను ఎదుర్కొనవలసి వస్తుంది. ఆర్థిక నిర్ణయాలలోనూ, పెట్టుబడులందు, వ్యాపార విస్తరణ విషయంలో ఇబ్బందులు రాకుండా చూచుకొనాలి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ప్రభుత్వ అనుమతులు, కాంట్రాక్టులు, లీజు వ్యవహారాలు వాయిదా పడతాయి. ఖర్చులు పెరిగి ఆర్థికంగా ఇబ్బందిపడతారు. వృత్తిపరంగా వ్యాపకం పెరిగి ఆదాయం పెరుగుతుంది. వ్యాపారవర్గాలకు మంచి అవకాశాలు వాయిదా పడవచ్చును. కుటుంబంలో చిన్నచిన్న సమస్యలు ఇబ్బందులుండి సర్దుబాటు కాగలవు. స్థిరాస్తులు, షేర్లపై లాభాలుంటాయి.

# మూడు గ్రామాలను దత్తత తీసుకుంటాం

**- లోక్‌సత్తాపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్రా శ్రీధర్**



హుద్‌హుద్ తుఫాన్ బాధితులను ఆదుకొనేందుకు మూడు గ్రామాలను లోక్‌సత్తా పార్టీ దత్తత తీసుకోనుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్రా శ్రీధర్ అన్నారు. నెల్లూరు నగరం రామలింగాపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ తుఫాను బాధితులను ఆదుకోవాలన్న సంకల్పంతో పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు ఈ బృహత్‌కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. నెల్లూరుజిల్లాలో ప్రజల నుంచి, పార్టీ కార్యకర్తలు, అభిమానుల నుంచి విరాళాలు సేకరించనున్నామన్నారు. విరాళాలు అందించాలనుకునే వారు లోక్‌సత్తాపార్టీ ఫ్లడ్ రిలీఫ్ ఫండ్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్, పంజాగుట్ట, అకౌంట్ నెం. 62109367386, ఐఎఫ్‌ఎస్‌కోడ్ - ఎస్‌బిహెచ్‌వై 0020072కు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపి బాబురావు, ఎం.ఎస్.మణి, ఎం.కె.రెడ్డి, ఎస్.శ్రీనివాసులునాయుడు, ఎల్.కృష్ణవేణి, ఎన్.ప్రసాద్, వి.డి.రామానాయుడు, పి.పుష్పలత, జె.యల్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గో ఆధారిత వ్యవసాయదారుల రాష్ట్ర కమిటి

నెల్లూరు దర్గామిట్టలోని ఎన్‌జిఓ హోంలో ఆదివారం గో ఆధారిత వ్యవసాయదారుల సంఘం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటిని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామకృష్ణరాజు(పశ్చిమగోదావరి), ఉపాధ్యక్షులుగా ఎంసివి ప్రసాద్(చిత్తూరు), హైమావతి (కడప), ప్రధానకార్యదర్శిగా కె.గంగాధర్(చిత్తూరు), కార్యదర్శులుగా టి.నాగరాజు(అనంతపురం), అడ్డాల గోపాలకృష్ణ(తూర్పుగోదావరి), పి.రామ్మోహన్‌రెడ్డి(నెల్లూరు), కోశాధికారిగా కృష్ణంరాజు(గుంటూరు), సహాయకోశాధికారిగా జయరామ్‌రెడ్డి(నెల్లూరు) ఎంపికయ్యారు. యువజన విభాగం కమిటిగా సూర్యప్రకాష్‌రెడ్డి(కర్నూలు), రమణారెడ్డి (కడప), వెంకటరమణ(కర్నూలు), జి.టి.నాయుడు(నెల్లూరు), మహిళా ప్రముఖంగా విజయలక్ష్మి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సేంద్రీయవ్యవసాయ అభివృద్ధి కోసం ఆర్గానిక్ మిషన్ పేరుతో తగిన యంత్రాగాన్ని ఏర్పాటు చేయడం, 50శాతం రాయితీతో దేశీయ ఆవులను రైతులకందించే విధంగా తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టిసి అధికారులు నాగజ్యోతి, సత్యనారాయణచౌదరి, డాక్టర్ వినీత, టిటిడి గోశాల డైరెక్టర్ హరనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- మానవత్వం మంట కలిసింది

# బాలికతో వ్యభిచారమా!

అన్నంపున్నెం ఎరుగని చిన్నారి బాలికతో ఓ మహిళ మానవత్వాన్ని మంటకలిపి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వివరాల్లోకి వెళితే కుమార్తె తప్పిపోయిందని తండ్రి ఈ నెల 22న నెల్లూరు ఒకటవ నగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో దర్యాప్తు చేసిన పోలీసులు ఆ బాలిక నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో ఉందని తెలుసుకున్నారు. అక్కడకి వెళ్లి చూస్తే ఓ మహిళ ఆ బాలికను వ్యభిచార కూపంలో ఉంచినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సివుంది.

# భాజపాలోకి గిరిజనులు



నెల్లూరు పరిసర ప్రాంతాల్లోని వివిధ గ్రామాలకు చెందిన దాదాపు 250మంది గిరిజనులు భారతీయ జనతాపార్టీలో చేరారు. నెల్లూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, నెల్లూరుజిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి సమక్షంలో నాయకుడు పి.శ్రీనివాసులు నేతృత్వంలో కోవూరు, గుమ్మళ్ళదిబ్బ, పాటూరు, చెన్నూరు గాంధీ గిరిజన సంఘం గ్రామాలకు చెందిన గిరిజనులు పార్టీలో చేరారు. నాయకులు వీరందరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# భక్తిశ్రద్ధలతో నాగులచవితి



కార్తీకమాసం శుక్లపక్షంలో వచ్చే నాగచతుర్థి, నాగపంచమి, నాగాష్టమి మూడురోజులు నాగపూజలు చేస్తారు. సర్పదోషాలు, కాలసర్పదోషం వుంటే ఈ వ్రతం చేయడం ద్వారా తొలిగిపోతాయి. నెల్లూరు నగరంలో నాగులచవితి పండుగను నగర ప్రజలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కార్తీకమాస తొలి సోమవారం రోజునే నాగులచవితి రావడంతో మహిళలు నోములు నోచుకుని వ్రతాలు చేశారు. నాగేంద్రుడి పుట్టల చుట్టూ నోముదారాలు చుట్టారు. చలివిడి, వడపప్పు నైవేద్యంగా పెట్టడంతో పాటు పుట్టలో పాలుపోసి మొక్కులు చెల్లించుకున్నారు. నెల్లూరు మూలాపేటలోని శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి దేవస్థానం, పాతపెద్దాసుపత్రి ప్రక్కన పొర్లుకట్ట వద్ద వున్న నాగళ్ల పరమేశ్వరి ఆలయం, నిప్పో ఎదురుగాగల నాగేంద్రుని పుట్ట, రాయాజీవీధిలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయం, కొండాయపాలెం గేటు, డైకస్‌రోడ్డు సెంటర్, శెట్టిగుంటరోడ్డు, బాలాజీనగర్ పుట్టవీధి తదితర ప్రాంతాల్లోని నాగేంద్రుడి పుట్టల వద్ద నాగప్రతిమలు, నాగదేవతలకు భక్తులు పూజలు నిర్వహించారు.



## హుద్‌హుద్ తుఫాను బాధితులకు

# నెల్‌క్యాస్ట్ చేయూత



గూడూరు నెల్‌క్యాస్ట్ యాజమాన్యం మరియు సిబ్బంది ఒకరోజు వేతనాన్ని విశాఖపట్నం మరియు విజయనగరం హుద్‌హుద్ తుఫాను బాధితులకు సిఎం రిలీఫ్‌ఫండ్‌కు రూ. 2,50,000/-లు ఆర్డీవో కె.శ్రీనివాసరావుకు గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నెల్‌క్యాస్ట్ యాజమాన్యం చెక్కును గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జీఎంలు యన్.ఎస్.రెడ్డి, డి.రవీంద్రనాథ్‌రెడ్డి, కె.బ్రహ్మానందరెడ్డి, సిహెచ్ శ్రీనివాసరావు, టి.మురళీకృష్ణ, వెంకటరావు, పిఆర్వో ఎ.శివకుమార్, అసిస్టెంట్ మేనేజింగ్ శ్రీనివాసరామూర్తి, వి.శ్రీనివాసులు, యూనియన్ మెంబర్లు వెంకటసుబ్బయ్య, బాలనాగేంద్ర, ప్రసాద్‌రెడ్డి, హజరత్, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ ఆసుపత్రికి విరాళం



నెల్లూరు పొదలకూరురోడ్డులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి నెల్లూరుజిల్లా సూళ్లూరుపేటకు చెందిన శకుంతలాదేవి రూ. 2.5 లక్షల విరాళాన్ని ప్రకటించారు. క్యాన్సర్‌తో మృతిచెందిన శకుంతలాదేవి భర్త మహేశ్వర్ జ్ఞాపకార్థం విరాళాన్ని ఇస్తున్నట్లు మంగళవారం పేర్కొన్నారు. మహేశ్వర్ సోదరులు కుటుంబశ్రేయోభిలాషి డాక్టర్ నారాయణరెడ్డి ఈ మొత్తాన్ని ఆసుపత్రి ఇన్‌ఛార్జ్ డాక్టర్ లక్ష్మికి అందజేశారు.

## కాలధర్మం

# గునుపాటి రుక్మిణమ్మ



ప్రపంచ వ్యాప్తంగా కీర్తిప్రతిష్టలు పొందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, జివికె ఇండస్ట్రీస్ అధినేత పద్మభూషణ్ బిరుదాంకితులు గునుపాటి వెంకటకృష్ణారెడ్డి(జివికె) వంటి మహోన్నత వ్యక్తికి జన్మనిచ్చిన మహాతల్లి, మాతృమూర్తి, కీర్తిశేషులు గునుపాటి సుబ్బ రామిరెడ్డి ధర్మపత్ని శ్రీమతి గునుపాటి రుక్మిణమ్మ అక్టోబర్ 30వ తేదీ గురువారం తెల్లవారుఝామున శివైక్యం చెందారు. ఆమె వయసు సుమారు 103సంవత్సరాలు. ఆమెకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్దకుమారుడు జివికెరెడ్డి గురించి దేశంలో తెలియని వారుండరు. పవిత్ర కార్తీక మాసంలో అది కూడా కోటిసోమవారం అయిన పుణ్యదినాన ఆ పుణ్యమూర్తి ఈ లోకాన్ని వీడి కైలాస సన్నిధికి చేరారు. ఇందుకూరుపేట మండలం కొత్తూరులో పెద్ద రైతుకుటుంబం వారిది. గునుపాటి సుబ్బరామిరెడ్డి ఇందుకూరుపేట కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మెన్‌గా పనిచేసి రైతులకు ఎనలేని సేవలందించారు. సుబ్బరామిరెడ్డి మరణం తర్వాత కూడా రుక్మిణమ్మ తన ఇంటిని తన ఊరిని వదిలిపెట్టలేదు. జివికె దేశవిదేశాలలో వ్యాపార సంస్థలను విస్తరిస్తూ ఎంతో బిజీగా వున్నా వీలైనంతవరకు ప్రతివారం లేదంటే కనీసం 15రోజులకొకసారన్నా కొత్తూరుకు వచ్చి తన తల్లిని చూసిపోనిదే ఆయన మనసు నిలిచేది కాదు. తన తల్లి కోసమే ఆయన కొత్తూరులో వున్న ఇళ్లు, పొలాలు వేటినీ అమ్మలేదు. తన తల్లిదండ్రుల జ్ఞాపకాలుగా వాటిని అలాగే ఉం చారు. ఆమె పేరుతో ఇందుకూరుపేట మండలంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందిరమ్మ గృహాల కోసం పేదలకు తమవంతు ఆర్థికసాయం అందించారు. మధ్యాహ్న భోజన పథకం కోసం ఆయా స్కూళ్లలో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులతో పాటు యూనిఫారంలు అందజేశారు. గునుపాటి సుబ్బరామిరెడ్డి, రుక్మిణమ్మల పేరుతో ఇందుకూరుపేటలో హైస్కూల్, డిగ్రీ కాలేజీ వెలిసాయి. అలాగే చిన్మయా మిషన్‌వారి నిర్వహణలో అత్యాధునిక విద్యాసంస్థను నెలకొల్పారు. తన తల్లి అంటే జివికెకు ఎనలేని ప్రేమ. ఆమె మరణాన్ని ఆయన మనసు తట్టుకోలేక పోయింది. తల్లి మరణవార్త తెలియగానే బరువెక్కిన హృదయంతో కుటుంబసభ్యులతో సహా ఆయన కొత్తూరుకు చేరుకున్నారు. రుక్మిణమ్మ మరణంతో ఇందుకూరుపేట పరిసర ప్రాంతాలలో విషాదం నెలకొంది. తమ ఇంటిదీపం ఆరిపోయిందన్న బాధతో అందరి కళ్లు చెమర్చాయి. గురువారం సా॥ 4.30గంటలకు కొత్తూరులోని శ్మశాన వాటికలో ఆమె చిన్న కుమారుడు గునుపాటి రామ్మోహన్‌రెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు.

మహాతల్లి రుక్మిణమ్మ మృతికి సంతాపం ప్రకటిస్తూ, తల్లిని కోల్పోయి శోకసంద్రంలో వున్న జివికెకు వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# వెంకయ్యను కలిసిన మస్తానయ్య

రాష్ట్ర రాజధాని నిర్మాణ కమిటి సభ్యుడు, మాజీఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు సోమవారం ఢిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి యం.వెంకయ్యనాయుడుని కలిసారు. బిట్రగుంటలో రైల్వే అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయన వెంకయ్యతో చర్చించారు. బిట్రగుంటలో స్లీపర్‌కోచ్ ఫ్యాక్టరీ, సోలార్ ఎనర్జీ పార్క్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. కావలి రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలని, అన్ని సూపర్‌ఫాస్ట్ రైళ్లు అక్కడ ఆగేలా చర్యలు తీసుకోవాలని మస్తానయ్య అడిగారు. పనిలో పనిగా ఆయన కేంద్ర రైల్వేమంత్రి సదానందగౌడను, రైల్వేబోర్డు ఛైర్మెన్‌లను కూడా కలిసి రైల్వే సమస్యలపై చర్చించారు.

# టార్గెట్ ఏపి

(మొదటిపేజీ తరువాయి)

ఏ పార్టీ కూడా సొంతంగా ఎదగడం అంటూ ఉండదు. ఎప్పుడు కూడా అధికారంలో ఉండే పార్టీల మీద వచ్చే వ్యతిరేకతతోనే ఇంకో పార్టీ బలపడుతుంటుంది. ప్రస్తుతం దేశంలో అటువంటి కాలమే నడుస్తుంది. 130ఏళ్ల ఘనచరిత్ర కలిగిన కాంగ్రెస్‌పార్టీకి చేటుకాలం దాపురిస్తే, ఒకప్పుడు కమ్యూనిష్టుపార్టీల కంటే బలహీనంగా వున్న బీజేపీ క్రమక్రమంగా బలపడుతోంది. ప్రతి రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ స్థానాన్ని బీజేపీ ఆక్రమించుకుంటూపోతుంది.

నరేంద్ర మోడీ సారధ్యంలో బీజేపీ మొన్నటి సార్వత్రిక ఎన్నికలలో తిరుగులేని విజయం సాధించడమే కాదు, మోడీ నాయకత్వ ఇమేజ్‌తో దేశ పగ్గాలు చేపట్టిన బీజేపీ అదే ఊపుతో ఆయా రాష్ట్రాల్లోనూ తమ పునాదులను పటిష్టం చేసుకోవడానికి పావులు కదుపుతోంది. కేంద్రంలో అధికారంలోకి వచ్చాక ఇటీవలే మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరిగాయి. మహారాష్ట్రలో పెద్ద పార్టీగా అవతరించిన బీజేపీ శివసేన మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. మహారాష్ట్ర సీఎం పీఠంను బీజేపీ దక్కించుకోవడం ఇదే మొదటిసారి. ఇక హర్యానాలో అయితే బీజేపీ గెలుపు పెద్ద వండర్. ఎందుకంటే బీజేపీ అక్కడ కనీసం ప్రతిపక్షంలో కూడా లేదు. కొంచెం బలమున్న పార్టీ కూడా కాదు. గత ఎన్నికల్లో ఆ పార్టీకి వచ్చింది కేవలం నాలుగు సీట్లే. అలాంటి పార్టీ ఐదేళ్లలోనే 47సీట్లు తెచ్చుకుని అధికారాన్ని చేపట్టగలిగిందంటే అది మోడీ ఊపే. త్వరలోనే ఎన్నికలు జరుగనున్న జమ్ము కాశ్మీర్, జార్ఖండ్, బీహార్‌లను కూడా అదే ఉత్సాహంతో కైవసం చేసుకోవాలని ఆ పార్టీ శ్రేణులు పనిచేస్తున్నాయి.

కాగా దక్షిణాదిలో ఆంధ్రప్రదేశ్‌ను బీజేపీ లక్ష్యంగా చేసుకుంది. దక్షిణాదిన ఒక్క కర్నాటక రాష్ట్రంలో మాత్రమే బీజేపీ బలంగా వుంది. కేరళ, తమిళనాడు రాష్ట్రాలలో ఆ పార్టీ చొచ్చుకుపోవడానికి అవకాశాలు రావట్లేదు. తెలంగాణలో చూస్తే టీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు పటిష్టంగా వున్నాయి. కాని ఏపిలో మాత్రం వాతావరణం బీజేపీ వైపు టర్న్ అవుతుంది. రాష్ట్ర విభజనతో ఏపిలో కాంగ్రెస్ ఎత్తిపోయింది. ఎన్నికలకు ముందే ఆ పార్టీ నాయకులు చాలామంది తెలుగుదేశం, వైకాపా, బీజేపీలలోకి జారుకున్నారు. ఇప్పుడు తెలుగుదేశం అధికారంలో ఉంది. కాంగ్రెస్‌లో మిగిలినవాళ్లు టిడిపిలోకి పోలేరు. అలాగని వైకాపాలో చేరరు. వాళ్లకు ప్రత్యామ్నాయం బీజేపీనే! అందుకే మిగిలిన కాంగ్రెస్ నాయకులు బీజేపీ వైపు మొగ్గుచూపుతున్నారు. ఆ కోవలో గుంటూరుజిల్లాలో బలమైన కాంగ్రెస్ నేత కన్నా లక్ష్మీనారాయణ బీజేపీలో చేరారు. మాజీముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డితో సహా మరికొందరు కాంగ్రెస్ నేతలు త్వరలో బీజేపీలో చేరే అవకాశాలున్నాయి. ఇక అధికారంలోకి వస్తుందనుకున్న వైకాపా ప్రతిపక్షంలో ఉండడాన్ని ఆ పార్టీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇంకా నాలుగున్నరేళ్లు ప్రతిపక్షంలో ఉండాలంటే వారికి కష్టమనిపిస్తుంది. అంతేకాదు, వచ్చే ఎన్నికల దాకా పార్టీ ఉంటుందా? జగన్ పార్టీని నిలబెట్టగలడా? ఆయనపై వున్న కేసుల సంగతేంటి? ఇన్ని సందేహాలతో నేతలున్నారు. అదీగాక నాలుగున్నరేళ్ల తర్వాత జరిగే ఎన్నికలలోనైనా మళ్లీ వైకాపాకు అధికారం దక్కుతుందా? లేదా అనేది ఒక డౌటు. కాబట్టే ఆ పార్టీ నాయకులు కొందరు ముందుజాగ్రత్తగా బీజేపీ వైపు చూస్తున్నారు.

తెలుగుదేశం పార్టీలోనూ అసంతృప్తులున్నాయి. అయితే ప్రస్తుతం పార్టీ అధికారంలో ఉంది కాబట్టి ఎవరూ నోరు మెదపట్లేదు. కాని ఇక రెండు, మూడేళ్ల తర్వాత అసమ్మతి, అసంతృప్తి వున్న నాయకులందరు కూడా బీజేపీ వైపే చూసే అవకాశాలున్నాయి.

దేశవ్యాప్తంగా మోడీ పాలనాహవా కనిపిస్తుంది. అదే ట్రెండ్ ఏపిలోనూ వుంది. కేంద్రంలో అధికారాన్ని ఉపయోగించుకుని మన రాష్ట్రంలో బలపడడానికి బీజేపీకి ఇంతకంటే మంచి సమయం ఇకరాదు. 1983లో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని పెట్టకపోయివుంటే ఈరోజు రాష్ట్రంలో బీజేపీ ఒక బలమైన పక్షంగా ఉండేది. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలు మాత్రమే ఉండేవి. మన రాష్ట్రంలో బలమైన శక్తిగా ఎదగడానికి ఆరోజు రాని అవకాశం ఈరోజు బీజేపీకి వచ్చింది. ఈ ఐదేళ్ల పరిపాలనలో చంద్రబాబుపై వ్యతిరేకత కొంతైనా వస్తుంది. ఏ ఒక్క హామీని ఆయన నెరవేర్చే పరిస్థితి లేదు. కాబట్టి ప్రజలలో ఆయనపై వ్యతిరేకత తప్పదు. అదే సమయంలో వైకాపా కూడా క్రమంగా బలహీనపడితే ఏపిలో బీజేపీ అనూహ్యంగా ఎదిగే అవకాశముంది.

# జిల్లాకు వరాలదేవుడు

(మొదటిపేజీ తరువాయి)

అతి చిన్న వయస్సులో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టడం దగ్గర నుండి అత్యధిక వన్డేలు, అత్యధిక టెస్ట్‌లు, వన్డేలో అధిక సెంచరీలు, టెస్ట్‌లలో అధిక సెంచరీలు, వన్డేలో డబుల్‌సెంచరీ, టెస్ట్‌లో ట్రిబుల్ సెంచరీలు... ఇలా అతనిపేరుతో ఎన్ని రికార్డులు నమోదయ్యాయో చెప్పలేము. అంతర్జాతీయంగా క్రికెట్ క్రీడకే అతను అంబాసిడర్. అందరూ క్రికెట్ దేవుడిగా, వీరుడిగా పిలుచుకునే భారతీయ క్రికెట్ క్రీడాకారుడు మాస్టర్‌బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్. ఒక క్రీడాకారుడిగా భారత ఖ్యాతిని ఇనుమడింపజేసిన సచిన్ ప్రస్తుతం తన దేశ పార్లమెంటు సభ్యుడు కూడా! ఇప్పుడు ఆ పదవి ద్వారా దేశఖ్యాతిని పెంచేలా కృషి చేస్తున్నాడు.

సచిన్ పుట్టిపెరిగింది ముంబైలో... ప్రపంచ దేశాలన్నీ తిరిగాడు. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరుజిల్లా అంటే ఆయనకు తెలియకపోవచ్చు. అందులోనూ గూడూరు మండలంలో పుట్టంరాజుకండ్రిక అనే కుగ్రామం గురించి ఇక తెలిసే అవకాశమే లేదు. కాని ఏ జన్మలోనో ఆ గ్రామంతో సచిన్‌కు అనుబంధం ఉండినట్లుంది. మనిషికి ఏడు జన్మలుంటాయని మన శాస్త్రాలు చెప్పేది నిజమే అయితే గత జన్మలో సచిన్ ఆ గ్రామ పౌరుడై ఉండొచ్చు. అందుకే ఈ జన్మలో ఆ గ్రామానికి సేవచేయడానికి సంకల్పించి ఉండొచ్చు. అవును... గూడూరు మండలంలోని పుట్టంరాజు కండ్రిక గ్రామాన్ని దత్తత తీసుకోవడానికి సచిన్ అంగీకరించినట్లు సమాచారం. ప్రతి ఎంపి ఒక గ్రామాన్ని దత్తత తీసుకోవాలని ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపు మేరకు సచిన్ ఈ గ్రామాన్ని దత్తత తీసుకోవడానికి ముందుకొచ్చారు. సచిన్ ఎంపి నిధుల నుండి నాలుగుకోట్ల రూపాయలు ఈ గ్రామంలో అభివృద్ధి పనులకు మంజూరు చేయనున్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ మంజూరు చేసిన 3కోట్ల రూపాయలతో ఈ గ్రామంలో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ గ్రామాన్ని దత్తత తీసుకోవడానికి, గ్రామంలో జరిగే అభివృద్ధి పనులు పర్యవేక్షించడానికిగాను నవంబర్ 15వ తేదీన ఆయన ముంబై నుంచి చెన్నైకి వచ్చి అక్కడి నుండి హెలికాప్టర్‌లో కృష్ణపట్నంపోర్టుకు చేరుకుంటారు. ఆ రాత్రికి అక్కడే బసచేసి, 16వ తేదీ ఉదయం సచిన్ ఈ గ్రామానికి రానున్నట్లు అధికారులకు వర్తమానం అందింది. దీనికి సంబంధించిన రూట్‌మ్యాప్ అంతా కూడా జాయింట్ కలెక్టరే రూపొందించినట్లు తెలుస్తోంది.

## లింకు ఎలా కుదిరింది

ఏమాత్రం తనకు సంబంధంలేని పుట్టంరాజుకండ్రికను సచిన్ దత్తత తీసుకోవడానికి ప్రధానవారధి మన జాయింట్ కలెక్టర్ రేఖారాణినే! ఆమె ఇటీవల న్యూయార్క్ నుండి వచ్చేటప్పుడు అదే విమానంలో సచిన్ ఎక్కారు. విమానం దుబాయ్‌లో ఆగినప్పుడు నెల్లూరుజిల్లాలో ఒక గ్రామాన్ని దత్తత తీసుకోవాలని ఆమె సచిన్‌ను కోరారు. ఏ గ్రామాన్ని దత్తత తీసుకోవాలో సూచిస్తూ ప్రతిపాదనలు పంపమని సచిన్ చెప్పారు. రేఖారాణి నెల్లూరొచ్చాక ఇదే విషయం కలెక్టర్ శ్రీకాంత్‌తో చర్చించారు. కలెక్టర్ అప్పటికే పుట్టంరాజుకండ్రికను ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దాలని నిర్ణయించి ఉండడంతో ఆ గ్రామాన్ని దత్తత తీసుకోవాలని కోరుతూ సచిన్‌కు ప్రతిపాదనలు పంపారు. ఈ గ్రామాన్ని దత్తత తీసుకోవడానికి సచిన్ నుండి ఆమోదం లభించింది. దత్తతతో ఆ గ్రామంలో జరిగే అభివృద్ధిని అటుంచితే సచిన్ అనే అంతర్జాతీయ సెలబ్రిటి ఆ గ్రామాన్ని దత్తత తీసుకోవడం, ప్రత్యేకించి ఆ గ్రామానికి వస్తుండడం ఆ గ్రామప్రజల అదృష్టమేననుకోవాలి.

# శివుడితో బాబు వీడియోకాన్ఫరెన్స్

గల్పిక

అది కైలాసం... పార్వతీపరమేశ్వరులు తమ గదిలో కూర్చుని ఉన్నారు. వారికెదురుగా ఒక ఎల్‌సిడి ఉంది. దాంట్లో భూలోకంలో జరిగే విశేషాలన్నీ కనిపిస్తున్నాయి. వాటిని చూస్తూ భోళా శంకరుడు తెగ ఆనందపడిపోతున్నాడు. ఆయన ఇంట్లోని ఎల్‌సిడికి భూలోకంలోని ప్రతిప్రాంతంలో జరిగే సంఘటనలన్నీ కనిపించేలా శాటిలైట్ కనెక్షన్‌ను ఇస్రోవాళ్ళు ఫ్రీగా ఇచ్చారు. దాంతో భూలోకంలో ఏం జరిగినా శివుడికి ఇట్టే తెలిసిపోతోంది. అలా స్క్రీన్ మీద అన్ని శివాలయాలను పరిశీలిస్తుండగా... "ఓం నమః శివాయ.. ఓం నమః శివాయ" అని మాటలు వినిపించాయి. పార్వతీదేవి వుండి... స్వామి, మీ దర్శనం కోసం ఎవరో తపస్సు చేస్తున్నట్లుగా ఉంది. ఒకసారి ఆ శివనాస్మరణ ఎక్కడ నుండి వస్తుందో చూడండి అని కోరింది. వెంటనే శివయ్య... తన కంట్రోల్‌రూంకు ఫోన్ చేసి నా గురించి ఎవరో తపస్సు చేస్తున్నారు. అతనెవరో కనిపెట్టండి అని చెప్పి ఫోన్ పెట్టేశాడు. పది నిముషాల్లో కైలాసగిరి కంట్రోల్ రూం నుండి మళ్ళీ శివయ్యకు ఫోన్... స్వామి, భూలోకంలో మీ గురించి ఓ వ్యక్తి కఠోరతపస్సు చేస్తున్నాడు. అతనికి గడ్డం కూడా తెల్లబడిందని చెప్పారు. అప్పుడు శివయ్య... నాకు స్క్రీన్ మీద అతని పిక్చర్ క్లియర్‌గా కనిపించేలా కెమెరాను జూమ్ చేయండని ఆదేశించాడు. కంట్రోల్ రూం వాళ్లు అలాగే చేశారు. అప్పుడు స్క్రీన్ మీద తపస్సు చేస్తున్న వ్యక్తి స్పష్టంగా కనిపించసాగాడు. తన కోసం అంత ఘోరంగా తపస్సు చేస్తున్నది హైటెక్‌రత్న, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడేనని గ్రహించాడు. కార్తీకమాసంలో ఎవరన్నా పూజలు చేస్తారు. ఇతనేంటి ఏకంగా తపస్సే చేస్తున్నాడు. ఏదో బలమైన కోరికే ఉండుంటుంది అనుకున్నాడు. పార్వతీదేవి వుండి... ఆ భక్తుడు చూడండి, మీ కోసం ఎంత నిష్టగా తపస్సు చేస్తున్నాడో, ఈ కాలంలో కూడా ఇటువంటి భక్తులుంటారా? అతను గాలి కూడా పీల్చుకోకుండా మీ నామస్మరణ చేస్తున్నాడని అంది. శివుడు ఎల్‌సిడి స్క్రీన్ మీద ఇంకొంచెం క్షుణ్ణంగా పరిశీలించాడు. అక్కడ సీన్ చూసి ఆయన ఆశ్చర్యపోయాడు. చూసావా దేవి... ఈ చంద్రబాబు ఋణమాఫీ అంటూ తన ప్రజల చెవుల్లో పూలు పెట్టినట్లే మన చెవుల్లోనూ పెట్టాలనుకుంటున్నాడని అన్నాడు. అంత తప్పు అతనేమి చేశాడు స్వామి అని పార్వతీదేవి అడిగింది. అతని పక్కన సి.డి రికార్డర్ వుంది చూసావా! ఓంకార నాదం అందులో నుండే వస్తుంది, మనల్ని బురిడీ కొట్టించాలని చూస్తున్నాడని శివయ్య కోపంగా అన్నాడు. అందుకు పార్వతీదేవి... మీ పాత్రతో వచ్చిన డబ్బింగ్ సినిమాలను చూసి మీరు ఆనంద పడట్లేదా... ఆ సినిమాలలో పాటపాడేదొకరు, పెదాలు కదిలించేదొకరు... ఈ కాలంలో ఇలాంటి భక్తులు దొరకడం అరుదేనండి... మీరేమీ ఆలోచించకుండా అతని బాధేమిటో కనుక్కోండని చెప్పింది. వెంటనే నెట్ ఓపెన్ చేసుకోమని చంద్రబాబుకు శివయ్య మెసేజ్ పెట్టాడు. చంద్రబాబు పక్కనేవున్న ల్యాప్‌టాప్ తీసి ఇంటర్‌నెట్ ఓపెన్ చేశాడు. కైలాసగిరి నుండి శివయ్యతో లింకయ్యాడు. స్క్రీన్ మీద శివయ్యను చూడగానే చంద్రబాబు భక్తితో నమస్కరించి, నేరుగా ప్రత్యక్షం కాకుండా ఈ ఇంటర్‌నెట్ సంభాషణేంటి స్వామి అని అడిగాడు. మీలాగే మేమూ టెక్నాలజీని బాగా పాడుకుంటున్నాం నాయనా, నేను అంత దూరం రావడం, తిరిగి కైలాసానికి రావడం... ఈ ప్రయాసంతా ఎందుకు చెప్పు, శుభ్రంగా ఇంటర్నెట్ వుంది కదా అని అన్నాడు. చంద్రబాబు ఉండి... అయినా ప్రోటోకాల్ ఒకటి ఉంది కదా స్వామి. ముందుగా నా తపస్సు భగ్నం చేయడానికి రంభ, మేనకలను పంపించి, ఆ తర్వాత కదా మీరు రావాలి అని అన్నాడు. ఆ ప్రోటోకాల్ నాది కాదు చంద్రబాబు, ఆయినా వాళ్ళు ఓల్డ్ అయ్యారు కదా, ఇప్పుడంతా భూలోకంలో త్రిష, కాజల్, తమన్నల కాలం నడుస్తుంది కదా, అయినా నువ్వు తపస్సు చేసింది నా కోసమా? లేక రంభ, మేనకల కోసమా అని శివయ్య అడిగాడు. చంద్రబాబు వెంటనే... లేదు స్వామి మీ కోసమే... కాకపోతే పనిలో పనిగా వారిని చూసినట్లుంటుందని అడిగానని చెప్పాడు. ఇంతకూ ఇప్పుడు నీకేం కావాలో చెప్పలేదని శివయ్య అన్నాడు. ఎన్నికల్లో నోటికి అడ్డు అదుపులేకుండా వాగ్ధానాలు చేశాను స్వామి, ఆరోజు ఓట్ల కోసం తీరుస్తామా లేదా అని ఆలోచించకుండా నోటికొచ్చినట్లు చెప్పేసా! ఇప్పుడు వాటిని తీర్చాలంటే నావల్ల కావడం లేదు. ముఖ్యంగా ఋణమాఫీ ఒకటి. ప్రజలు దీనిని మరిచిపోయేటట్లు చేయాలి. అలా మరచిపోవాలంటే ప్రజలు పనుల్లో నిమగ్నం కావాలి. కాబట్టి ముందు వర్షాలు కురిసేలా వరుణదేవుడిని ఆజ్ఞాపించండి స్వామి అని చంద్రబాబు కోరాడు. వెంటనే శివయ్య ఫోన్‌లో వరుణదేవుడితో మాట్లాడాడు. పది నిముషాల తర్వాత ఫోన్ పెట్టేసి... చంద్రబాబు, నీకు వరుణదేవుడికి పూర్వజన్మలో ఏదో శత్రుత్వం ఉన్నట్లుంది, నువ్వు సీఎంగా ఉన్నంతకాలం ఆయన ఇటువైపు కన్నెత్తి కూడా చూడడట... అని ఇంకేదైనా కోరుకో అని శివయ్య అడిగాడు. చంద్రబాబు సూర్యుడు, అగ్ని దేవుళ్ళనన్నా కనికరించమని కోరాడు. శివయ్య వారిని కూడా కాంటాక్ట్ చేసి... సారీ చంద్రబాబు వాళ్లిద్దరూ లీవ్‌లో ఉన్నారు. ఇంకేమన్నా ఆప్షన్ వుందా అని అడిగాడు. ఏమో స్వామి నాకు తెలియదు, మీరే ఏదో ఒక మార్గం చూపాలని చంద్రబాబు విన్నవించుకున్నాడు. అప్పుడు శివయ్య... నాకో ఐడియా వచ్చింది. అది నీ జీవితాన్నే మార్చేస్తుందన్నాడు. కొంపదీసి జీవితం మారడమంటే నా సీఎం పదవి వూడదు కదా అని చంద్రబాబు సందేహంగా అడిగాడు. లేదులే నాయనా, నీకు తోడుగా ఉండమని వాయు దేవుడిని పంపిస్తాను, అన్నీ సర్దుకుంటాయని చెప్పాడు. వాయిదేవుడితో నాకెలా ఉపయోగం స్వామి అని చంద్రబాబు అడిగాడు. ఎలా ఉపయోగమో నాలుగు రోజుల తర్వాత నీకే తెలుస్తుంది నాయనా అని చెప్పి శివయ్య లైన్ కట్ చేశాడు.

★★★★★

బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి వాయుగుండంగా మారింది. అది తీవ్ర తుఫానుగా అవతారమెత్తింది. దానికి హుద్‌హుద్ అని పేరు పెట్టారు. అది విశాఖ వద్ద తీరం దాటి ఉత్తరాంధ్రను అల్లకల్లోలం చేసింది. 200కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులకు ఉత్తరాంధ్ర వణికిపోయింది. చంద్రబాబు వైజాగ్‌లో వాలిపోయాడు. తాత్కాలికంగా క్యాంపు కార్యాలయాన్ని అక్కడే పెట్టుకున్నారు. బాధితులను ఆదుకోవడానికి విరాళాలు పంపాలంటూ ఆయన పత్రికా ప్రకటనలు పంపారు. విశాఖ తుఫాను, జరిగిన నష్టం గురించి, విరాళాలివ్వండంటూ చంద్రబాబు ఇచ్చిన ప్రకటనలు చూసి రుణమాఫీ మీద అరకొర మిగిలివున్న ఆశలను కూడా రైతులు వదిలేసుకున్నారు.

★★★★★

విశాఖలో తుఫాన్ బాధిత ప్రాంతాల్లో తిరుగుతుండగా చంద్రబాబు ఫోన్ మోగింది. ఆయన ఫోన్ తీసాడు. అవతల శివయ్య, ఏం చంద్రబాబు ఇప్పుడు ఋణమాఫీ గురించి ఎవరన్నా అడుగుతున్నారా అని అడిగాడు. లేదు స్వామి, తుఫాన్ దెబ్బకు ఇక్కడ ఇళ్లే కాదు, నా హామీలు కూడా కొట్టుకుపోయాయి. తుఫాన్ రూపంలో వచ్చిన వాయుదేవుడు నన్ను ఈ గండం నుండి గట్టెక్కించాడు. నేను సమస్యల్లో ఉన్నప్పుడల్లా ఇలా తుఫాన్ లొస్తే చాలు... ప్రజలు అన్నీ మరచిపోతారని చెప్పి ఫోన్ పెట్టేశాడు.

## కదంబం

## లోపలి చీకట్లు!

- గుర్రాల రమణయ్య
నెల్లూరు. 9963921943

బైట సరే...
ఈ లోపలి చీకెట్లనెలా వెలిగించాలి!
ఆరేసి పొరలుగా లుంగ చుట్టుకపోయి
ఆకాశంలా గాఢంగా అల్లుకపోయిన చీకట్లు
వేలుపట్టుక నడిచిన స్వాముల్ని సహితం
శత్రుసైన్యంలా చుట్టుముట్టి
మునగదీసిన చీకట్లు
సడీచప్పుడు లేని నిశ్శబ్ధ యుద్ధంలో
నిస్సహాయుడ్ని చేసి మనసుని
నరికేస్తున్న చీకట్లు
మనిషి తనాన్ని తిమింగిలం నోటితో మింగేసి
లోలోపల రాక్షసుడికి పట్టాభిషేకం
చేస్తున్న చీకట్లు
కళేబరమాత్రంగా మిగిల్చిన మానవసమూహాన్ని
గుణవిహీనుల్ని చేసి
ఆటాడిస్తున్న చిమ్మచీకట్లు
బైట సరే...
ఈ లోపలి చీకట్లనెలా మండించాలి!
జనజీవన స్రవంతిని పాయలు
పాయలుగా చీల్చి
ఒకరితో మరొకరికి ముఖ పరిచయం
లేకుండా చేస్తూ
మనోనేత్రపు కనీనికపైన
తెల్లపొరగా విజృంభించి
నైతికత నెత్తిమీద
బండరాతితో మోదుతున్నాయి
అంతఃసూత్రాన్ని సైతం
తుత్తునియలు చేస్తున్నాయి
దొంగదెబ్బ తీస్తూ దొరలా
మసులుతున్న చీకట్లు
మనిషి మనిషిలో కొండలా పెరిగి
కులుకుతున్న చీకట్లు
ప్రతి తల్లీ ఒక ఒంటరి సైన్యమై
మాటల వెన్న ముద్దల మతాబులతో
నిరంతర యుద్ధం సాగిస్తేనే తప్ప
ఈ చీకటి మృగానికి మరణం లేదు!
ప్రతి చూలాలు తన పాలిండ్లకి
నీతి కస్తూరి మాత్రల్ని అరగదీసి రాసి
పిల్లలకి ఆరారగ పట్టిస్తేనే తప్ప
ఈ ఆరేసి పొరల రాక్షసిని
మృత్యువు కబళించదు
ప్రతి కన్నమ్మ తన పిల్లలకి వసతో పాటు
ధర్మనిరతిని నూరిపోస్తేనే తప్ప
ఇంటింటా దీపావళి ముకుళించదు.

### సమాజాన్ని జాగృతం చేసే

## సాహిత్యానికి ప్రత్యేక స్థానం

సమాజాన్ని జాగృతం చేసే కథాసాహిత్యమే ప్రత్యేకస్థానం దక్కించుకుంటుందని కథారచయిత విహారి పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు, సరస్వతినగర్‌లోని ఐయంఏ హాలులో స్వర్గీయ పాతూరి మాణిక్యమ్మ స్మారక పురస్కారాన్ని విశాఖపట్టణానికి చెందిన రచయిత చింతకింది శ్రీనివాసరావుకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విహారి మాట్లాడుతూ చదివించగలిగేవి, ఆలోచింపజేసేవి, మనస్సును మార్పు దిశగా నడిపించే కథలే ప్రజలకు చేరువవుతాయన్నారు. చింతకింది శ్రీనివాసరావు రచించిన "దాళప్పతీర్థం" ఆ కోవకే చెందుతుందని అందుకే ఈ పురస్కారానికి ఎంపికైందన్నారు.

ఈ కార్యక్రమంలో కథారచయిత చంద్రశేఖరఆజాద్, రచయిత్రి డా॥ పెళ్ళకూరు జయప్రద, విశాలాక్ష్మి వృద్ధాశ్రమ వ్యవస్థాపకులు కోసూరు రత్నం ప్రసంగించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును ఘనంగా సత్కరించి రూ.3వేల నగదు, జ్ఞాపికను అందజేశారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ సాహిత్యం, కథలే ప్రజలను చైతన్యవంతులు చేసే సాధనాలన్నారు. నెరసం ప్రధానకార్యదర్శి పాతూరి అన్నపూర్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

## 2న రాధేయ స్మారక పురస్కారం

ప్రముఖ కవి రాధేయ స్మారక కవితా పురస్కారాన్ని నవంబర్ 2వ తేదీ ఆదివారం విశాఖపట్టణానికి చెందిన డాక్టర్ కె.జి.వేణు కవితకు ప్రదానం చేయనున్నట్లు పెరసం అధ్యక్షుడు షంషుద్దీన్ తెలిపారు. టౌన్‌హాల్ ఆవరణంలోని స్మారక భవనంలో జరిగే ఈ కార్యక్రమానికి ప్రముఖకవులు అద్దేపల్లి రామ్మోహన్‌రావు, అడిగోపుల వెంకటరత్నం, ఎస్.వి.యూనివర్శిటి ప్రొఫెసర్ మేడిపల్లి రవికుమార్ ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని తెలిపారు.

## పెన్నా సాహిత్య పురస్కారం - 2014 ప్రదానం

జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక పెన్నా సాహిత్య పురస్కారం-2014కు 37 కవితా సంపుటాలు అందగా, విజయనగరం జిల్లాకు చెందిన ఎస్.బాల సుధాకర్‌మౌళి రచించిన 'ఎగరాల్సిన సమయం'ని ఉత్తమ కవితా సంపుటిగా ఎంపిక చేయడం జరిగిందని, నవంబర్ 16న టౌన్‌హాల్‌లో ఉదయం 10గంటలకు జరిగే పెన్నారచయితల సంఘం 5వ వార్షికోత్సవంలో బాల సుధాకర్‌కి పురస్కార ప్రదానం జరుగుతుందని ఆ సంఘం వ్యవస్థాపక కార్యదర్శి గుండాల నరేంద్రబాబు ఒక ప్రకటనలో తెలియజేశారు.

### గుంటూరు జిల్లా రచయితల సంఘం

## సాహిత్య పురస్కారాలు

2010వ సంవత్సరం నుంచి గుంటూరుజిల్లా రచయితల సంఘం వివిధ ప్రక్రియల్లో సాహిత్య పురస్కారాలు అందిస్తోంది. 2013లో ప్రచురించబడిన స్వీయ, కథ, కవిత సంపుటులను జాతీయస్థాయిలో ఆహ్వానించి, పోటీ నిర్వహించడం ద్వారా ఇరువురు సాహిత్యకారులను ఎంపికచేసి వారికి చెరి రూ.5,000/-ల నగదు మరియు సత్కారం అందజేయడం జరుగుతుంది.

ఈ సంవత్సరం కవితాప్రక్రియలో డా॥ శిలాలోలిత రచన 'గాజునది' కవితా సంపుటిని, కథా ప్రక్రియలో డా॥ నక్కా విజయరామరాజు రచన "మా ఊరి కథలు" కథా సంపుటిని ఎంపిక చేయడం జరిగిందని, న్యాయ నిర్ణేతగా ప్రముఖ రచయిత, సంపాదకులు, విమర్శకులు పెనుగొండ లక్ష్మీనారాయణ వ్యవహరించారని త్వరలో గుంటూరులో జరుపబోయే సాహితీ సభలో వీరిని సత్కరిస్తామని ఒక ప్రకటనలో గుంటూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య, ప్రధానకార్యదర్శి కోసూరి రవికుమార్ తెలియజేశారు.

# దడ పుట్టిస్తున్న ఇసుక ధర



ఇసుక... రాష్ట్రంలో మద్యం తర్వాత ఇదే పెద్దవ్యాపారం. ఒకప్పుడు ఇసుక వ్యాపారంలో సన్న, చిన్న వ్యాపారులుండేవాళ్ళు. ఇప్పుడు పెద్ద కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు కూడా ఇసుక వ్యాపారంలో తల దూర్చి కోట్లు గడిస్తున్నారు. గత 20ఏళ్ల కాలంలో ఇసుక విలువ అంతకంతకు పెరుగుతూ వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇసుక రీచ్‌లకు వేలంపాట మరియు టెండర్లు నిర్వహిస్తూ వచ్చారు. ఇసుక కాంట్రాక్టర్లు రెండుచేతులా సంపాదించారు. అయితే వినియోగదారులకు ఇసుక అందుబాటులో ఉండేది. రోశయ్య సీఎం అయ్యాక కొంతకాలం ఇసుక రీచ్‌లపై నిషేధం నడిచింది. ఆ సమయంలో బ్లాక్‌లో ఇసుక బంగారం ధర పలికింది. ట్రైరు బండి వెయ్యి రూపాయలు, ట్రాక్టర్ మూడువేలు, టిప్పర్ 15వేలుగా ధర పలికింది. కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎం అయ్యాక ఇసుకరీచ్‌లకు టెండర్లు, వేలం పాటలు తీసేసి ఆయా గ్రామస్తులకే లక్కీడిప్ ద్వారా ఇసుక రీచ్‌లు అప్పగించారు.

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుకపై ఒక ప్రత్యేక పాలసీని తీసుకొస్తామంటూ చంద్రబాబు ప్రకటించారు. దీని కోసం తన మంత్రులను తమిళనాడు, కర్నాటకలకు పంపించి అధ్యయనం చేయించాడు. చంద్రబాబు ఏదో ఇసుకపై మంచి పాలసీ తెస్తాడని జనం నమ్మారు. తీరా చూస్తే మహిళా సంఘాలకు ఇసుకరీచ్‌లను అప్పగించారు. ఇంతవరకు బాగానే వుంది. కాని ప్రభుత్వం నిర్ణయించిన ఇసుక ధరే అదిరిపోతుంది. గతంలో బ్లాక్‌లో అమ్మిన ధరనే ఇప్పుడు ప్రభుత్వం అధికారికంగా చేసేసింది. ఒక క్యూబిక్ మీటర్ ఇసుక 600రూపాయలు, అంటే ఒక ట్రాక్టర్‌లో ఒక యూనిట్ ఇసుక వేస్తారు. దీనికి 1800రూపాయలు డి.డి. కట్టాలి. 200రూపాయలు లోడింగ్ ఛార్జీలు చెల్లించాలి. మరో 50రూపాయలు మెయింటెనెన్స్ ఛార్జీలు, ఇక రవాణా ఛార్జీల సంగతి చెప్పనక్కరలేదు.

జిల్లాలో 72రీచ్‌లకు అనుమతిని చ్చారు. ఏ రీచ్‌నుండైనా సమీప నగరాలు, పట్టణాలు, గ్రామాలకు నాలుగైదు కిలో మీటర్లకు తక్కువ దూరం ఉండదు. ఒక ట్రిప్పుకు వెయ్యిరూపాయలు కనీస రవాణా ఛార్జీ పడుతుంది. ఒక యూనిట్ ఇసుక కొనాలంటే మూడు వేల రూపాయల పైనే అవుతుంటే సామాన్యుడు ఇక ఇళ్లు కట్టుకునే పరిస్థితి ఉంటుందా? ప్రస్తుతం జిల్లాలోని అన్ని రీచ్‌ల వద్ద కూడా ఇసుక తోలకం కోసం ట్రాక్టర్ల యజమానులు పోటీలు పడుతున్నారు. ఇప్పుడు దూరాన్నిబట్టి రవాణా ఛార్జీలు బాగానే దండుతున్నారు. నవంబర్ 1 నుండి కిలోమీటర్‌కు 18రూపాయల లెక్కన రవాణా ఛార్జీలను నిర్ణయించనున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే ఏ ఒక్క ట్రాక్టర్‌ను కూడా ఇసుక తోలకానికి పెట్టే అవకాశాలు లేవు. మొత్తానికి తెలుగుదేశం ప్రభుత్వంలో ఇసుక సామాన్యులకు అందుబాటులోకి వస్తుందనుకుంటే ఇది అందనంత ఎత్తుకుపోయింది.









శ్లో॥ నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావక: ॥
నచైనం క్లేదయంత్వాపో నశోషయతి మారుత: ॥ (గీత)

## ఉత్తరక్రియలు

మా ఇంటి దీపం, మా ఆత్మీయరూపం
మా అమ్మ

## శ్రీమతి కంచి సుబ్బరత్నమ్మ (పాపమ్మ) గారు

తే.18.10.2014 శనివారం రాత్రి చెన్నైలో స్వర్గస్తురాలైనారు.

*వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తూ...*

**కుమారులు - కోడళ్ళు**

కె.యస్.రావు - ప్రేమలత
లేట్ కె.సుబ్రహ్మణ్యం నాయుడు - నిర్మల
కె.సుధాకర్, U.S.A - జయలక్ష్మి
కె.సూర్యప్రకాష్ - సుధ
మరియు మనుమలు, మనుమరాళ్ళు
- మునిమనుమలు, మునిమనుమరాళ్ళు

**పెద్దకర్మ :** తేది. 5.11.2014 బుధవారము ఉదయం గం.10.30లకు నెల్లూరు, గొలగమూడిరోడ్డులోని కొండాయపాలెంలోగల మా స్వగృహమునందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

సెల్: 92471 20475, 09789828878.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com